RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం
మన దేశం..మన హక్కు
తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 61 | ఆదివారం 30-06-2024 | పేజీలు :04 వెల:రూ. 2.00

## పింఛన్ దారులకు ఏపీ సీఎం చంద్రబాబు బహిరంగ లేఖ

అమరావతి,ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్దారులకు బహిరంగ లేఖ రాశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. 'మీకు అండగా నిలుస్తూ, సంక్షేమం చూసే ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది. మేనిఫెస్టోలో చెప్పినట్లు పింఛన్ ను ఒకేసారి రూ.వెయ్యి పెంచి ఇస్తున్నాం. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలు ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. జులై 1 నుంచే పెంచిన పింఛన్లు ఇంటి వద్దే అందిస్తాం. ఆర్థిక సమస్యలున్నా.. ప్రజా సంక్షేమం కోసం తొలి రోజు నుంచే నిర్ణయాలు తీసుకుంటున్నాం.పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు అదనంగా రూ.819 కోట్ల భారం పడనుంది. నాటి అధికార పక్షం మిమ్మల్ని పింఛన్ విషయంలో ఎంతో క్షోభ పెట్టింది. ఎన్నికల సమయంలో 3 నెలలు మీ కష్టాలు చూసి చలించిపోయాను. మండుటెండలో, వడగాడ్పుల మధ్య మీరు పడిన అగచాట్లు చూశా. ఏప్రిల్ నెల నుంచే పింఛన్ పెంపును వర్తింపజేస్తానని మాట ఇచ్చా. ఏప్రిల్, మే, జూన్ నెలలకూ పెంపును వర్తింపచేసి మీకు అందిస్తున్నాం" అని లేఖలో సీఎం పేర్కొన్నారు

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# చెప్పినట్టుగానే 7 వేలు పెన్షన్



విజయవాడ, జూన్ 29, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల్లో గెలిస్తే వృద్ధుల సామాజిక పెన్షన్లను నాలుగువేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో గెలవగానే మొదటే నిర్ణయం తీసుకున్నారు. సంతకం చేసి.. కేబినెట్‌లో తీర్మానం చేశారు. మూడు నెలల కిందట హామీ ఇచ్చినందున ఆ మూడు నెలల పాటు వెయ్యి బకాయిలు కూడా చెల్లించాలని నిర్ణయించారు. అంటే మొదటి నెల వృద్ధులకు తలా ఏడు వేల రూపాయలు అందుతాయి. ఇందు కోసం వృద్ధులు ఎదురు చూస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులకు సామాజిక భద్రత పెన్షన్ల మొత్తాన్ని పెంచుతూ 13వ తేదీన జీవో జారీ చేశారు. ఒఖీ (ఖఒఊఎం) వ్యక్తులు , సాంప్రదాయ చెప్పులు కుట్టేవారు, లింగమార్పిడి , డప్పు కళాకారులు నెలకు రూ. 4000, వికలాంగులు మ, బహుళ వైకల్య కుష్టువ్యాధి వ్యక్తులు నెలకు రూ. 6000 , పూర్తిగా వికలాంగులైన వారికి నెలకు రూ. 10,000 ,దీర్ఘకాలిక వ్యాధులు , క్రానిక్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు నెలకు రూ.10,000 పంపిణీ చేస్తారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపు వల్ల ప్రభుత్వంపై నెలకు రూ.819 కోట్ల అదనపు భారం పడనుంది. పెన్షన్ పెంపు నిర్ణయంతో 28 కేటగిరీలకు చెందిన దాదాపు 65.3 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్లకు పైగా ఖర్చు చేయనుంది. గ్రామ, వార్డు సచివాలయ పూర్తి స్థాయి ఉద్యోగులతోనే పెన్షన్ల పంపిణీ చేయనుంది. ప్రస్తుతం సచివాలయాల ద్వారా దాదాపు లక్షా 24 వేల మంది పూర్తి స్థాయి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతోనే స్థానిక ప్రజలకు దాదాపు అన్ని రకాల సంక్షేమం, ధ్రువీకరణ పత్రాల పంపిణీకి సులువైన మార్గం ఏర్పడిరది.ఒకటో తేదీన సోమవారం వస్తుంది. సచివాలయ ఉద్యోగులు శనివారం రోజునే బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకోవాలని ఆదేశించారు. అందుకే సమస్యలు లేకుండా సోమవారం ఉదయమే పంపిణీ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చే మొత్తంభారీగా ఉండటంతో వృద్ధుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. వాలంటీర్లు లేకపోయినా ఇంటింటికి పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం నిరూపించనుంది. అదేవిదంగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, పార్టీ ఇన్‌చార్జ్, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు నియోజకవర్గంలోని అన్ని ఏరియాలలో కవర్ అయ్యే విధంగా కనీసం 10 మంది లబ్ధిదారులకు పైగా పెన్షన్లను పంపిణీ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని హైలెట్ చేస్తూ.. సోషల్ మీడియాలో పోస్ట్ లు పెట్టాలన్నారు. ఆ రోజు మొత్తం నాయకులందరూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంపైనే ఉండాలని ఆదేశించారు. అలానే తన మంత్రివర్గంలోని ముఖ్య నాయకులను కూడా.. చంద్రబాబు ఆదేశించారు. మంత్రులు సైతం జిల్లాల స్థాయిలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జ్‌లు, ఇతర పదవుల్లో ఉన్న టీడీపీ నాయకులు ఆయా సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని సూచించారు.

## జులై 1 నుంచి పిఠాపురంలో పవన్ టూర్

విజయవాడ, జూన్ 29,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జులై 1 నుంచి కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు 3 రోజుల పర్యటనకు సంబంధించి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. తొలిరోజు గొల్లప్రోలులో పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత పిఠాపురం జనసేన నేతలతో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. అనంతరం జులై 2వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం జనసేన ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. జులై 3న ఉదయం ఉప్పాడ కొత్తపల్లి సముద్ర ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అదే రోజు సాయంత్రం పిఠాపురంలో వారాహి కృతజ్ఞతా సభలో ప్రసంగిస్తారు.జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న క్షేత్రాన్ని పవన్ కల్యాణ్ శనివారం సందర్శించారు. ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆయనకు మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో కాన్వాయ్ ఆపిన పవన్.. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తుర్కపల్లి క్రాస్ రోడ్స్ వద్ద జనసేన నాయకులు భారీ గజమాలతో ఆయన్ను సత్కరించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పవన్‌కు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు, అభిమానులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం జన సందోహంగా మారింది. పవన్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# కొండగట్టును దర్శించుకున్న పవన్ కళ్యాణ్

**ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సిఎం**
**దారిపొడవునా అభిమానుల నీరాజనాలు**



కొండగట్టు,జూన్29: ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో స్థానికులు ఆలయానికి తరలివచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలు దేరిన పవన్‌కు.. మార్గమధ్యలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. తుర్కపల్లి క్రాస్ రోడ్స్ వద్ద జనసేన నాయకులు గజమాలతో ఆయనను సత్కరించారు. పవన్ రాక నేపథ్యంలో.. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డుమార్గంలో శనివారం ఉదయం ఆయన కొండగట్టుకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయనకు దారి పొడవునా అభిమానులు ఘనస్వాగతం పలికారు. ముందుగా హైదరాబాద్ శివారులోని తుర్కపల్లిలో పవన్ కల్యాణ్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. తుర్కపల్లి నుంచి బయల్దేరిన తర్వాత సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి వద్ద కూడా జనసేన అధినేతకు ఘన స్వాగతం లభించింది. అక్కడ పవన్ కల్యాణ్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అభిమానులు అందించిన వీరఖడ్గంతో ఆయన ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం అభిమానులకు అభివాదం చేసుకుంటూ కొండగట్టుకు బయల్దేరి వచ్చారు. ఏపీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడంతో పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్షను చేపట్టారు. 11 రోజుల పాటు నిష్టతో ఈ దీక్షను పాటించనున్నారు. ఈ క్రమంలోనే తమ ఇలవేల్పు అయిన కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, గత ఏడాది ఎన్నికలకు ముందు ప్రచారం మొదలుపెట్టిన పవన్ కల్యాణ్.. తన వారాహి ప్రచార రథానికి కొండగట్టులోనే ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారాహి విజయయాత్రను నిర్వహించారు.

# డయేరియా నివారణకు తక్షణమే స్పెషల్ డ్రైవ్..

**మంత్రి నారాయణ కీలక ఆదేశాలు..**




వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకై అవసరమైన అన్ని చర్యలను చేపట్టేందుకు తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు.మంచినీటి పైపుల్లో లీకేజీలు ఉంటే 24 గంటల్లో అరికట్టాలని, కాలువల్లో చెత్తాచెదారాన్ని జూలై నెలాఖరుకల్లా తొలగించాలని ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్?లో రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దానికి తగ్గట్లుగా ముందస్తు నివారణ చర్యల కోసం ప్రణాళికలు సిద్దం చేసుకోవాలని కమిషనర్లకు సూచించారు. ఇప్పటి వరకూ మున్సిపాల్టీల్లో ఎక్కడా డెంగ్యూ కేసులు రాలేదని, అక్కడక్కడా డయేరియా కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు.దీనిపై వైద్యారోగ్యశాఖ అధికారులతో కూడా చర్చించారు. డయేరియా నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, డ్రెయిన్?లలో చెత్తను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. త్రాగునీటి సరఫరా పైపుల లీకేజీల నియంత్రణకు, కాలువల్లో చెత్తాచెదరాన్ని తొలగించి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు దాదాపు రూ.50 కోట్లను త్వరలో విడుదల చెయ్యనున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కమిషనర్లు వారి కార్పొరేషన్లలో అమలు చేయబడుచున్న పలు కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితిని వివరించడంతో పాటు తాగునీరు సరఫరా మెరుగుకు, మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి, డ్రెయిన్?లలో మురుగు తొలగింపుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

# వానలే.. వానలు



విజయవాడ, జూన్ 29, ఆంధ్రప్రదేశ్‌లో అల్పపీడన ద్రోణి ప్రభావంతో 3 రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో హోంమంత్రి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆరు జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. హోం మంత్రి అనిత ఏపీ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ పరిశీలన చేశారు.బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరిజిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. అలాగే ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరుజిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే ఉందన్నారు.ఉరుములతో కూడిన వర్షం పడేప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధిక వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూత

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస**
**నిజామాబాద్‌కు భౌతిక కాయం తరలింపు**
**నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**



హైదరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెల్లవారుజామున 3 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి ఏపీలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు డీఎస్ మంత్రిగా సేవలందించారు. పీసీసీ అధ్యక్షుడిగానూ ఆయన పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో భారాసలో చేరిన డీఎస్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం మళ్లీ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. డీఎస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు ధర్మపురి అర్వింద్ ప్రస్తుతం బీజేపీ తరఫున నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు. 1948 సెప్టెంబర్ 27న జన్మించిన డీఎస్ నిజాం కళాశాల నుంచి డిగ్రీ పూర్తిచేశారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దిగిన ఆయన నిజామాబాద్ అర్బన్ నుంచి తొలి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పీఆర్ మంత్రిగా, 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2004, 2009 ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షునిగా ఉన్నారు. 2004లో తెరాసతో కాంగ్రెస్ పొత్తులో క్రియాశీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో వైఎస్‌తో కలిసి పనిచేశారు.

**సోనియా గాంధీకి విధేయునిగా**

డీఎస్‌కు ప్రణబ్ ముఖర్జీ తదితర సీనియర్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సోనియా గాంధీకి విధేయునిగా గుర్తింపు ఉంది. జైపాల్ రెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డితో మంచి సంబంధాలు ఉన్నాయి. 2013 నుంచి 2015 వరకు శాసనమండలి సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం శాసనమండలిలో విపక్ష నేతగా కొనసాగారు. రెండో సారి ఎమ్మెల్సీగా అవకాశం రాకపోవడంతో అసంతృప్తి చెంది 2015లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి తెరాసలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 2016 నుంచి 2022 వరకు తెరాస రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో భారాసతో విభేదించి కాంగ్రెస్ నేతలతో మంతనాలు జరిపి తిరిగి సొంతగూటికి చేరుకున్నారు.తండ్రి, గురువు అన్నీ మా నాన్నే.. : అర్వింద్'అన్నా అంటే నేనున్నానని.. ఏ ఆపదలో అయినా ఆదుకునే శీనన్న ఇక లేరు.

నా తండ్రి, గురువు అన్నీ మా నాన్నే. పోరాడు, భయపడకు అని నేర్పింది ఆయనే. ప్రజలను ప్రేమించి, ప్రజల కొరకే జీవించు అని చెప్పారు. నాన్నా.. నువ్వు ఎప్పటికీ నాతోనే ఉంటావు.. నాలోనే ఉంటావు" అని డీఎస్ కుమారుడు అర్వింద్ కన్నీటి పర్యంతమయ్యారు.

# బియ్యం నిల్వ కేంద్రాలను తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల

కాకినాడ,పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి విదేశాలకు తరలించే వారిపై సమ గ్ర విచారణ చేపట్టి, తగు చర్యలు తీసు కోవడం జరుగుతుందని రాష్ట్ర పౌరస రఫరాలు,ఆహారం, వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.కాకినాడ జిల్లాలో పర్యటనలో భాగంగా ఆయన..రాష్ట్ర పౌరసరఫరాల విసి, ఎండీ వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాలు, రెవిన్యూ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల అధికా రులతో కలిసి కాకినాడ పట్టణం పరిధిలోని పోర్ట్ ఏరియా, కాకినాడ రూరల్, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని బియ్యం గోదాములు, ఆగ్రో ఇండస్ట్రీలను తనిఖీ చేసి, నమూనాలను సేకరించారు. తొలుత పోర్ట్ ఏరియాలో ఉన్న విశ్వప్రియ బియ్యం గోదాము, బీచ్ రోడ్డులోని సాటక్స్ ఇండియా రవీంద్ర బియ్యం గోదాము, మానస ఎక్స్ పోర్ట్, డీఎస్ఎన్ బియ్యం గోదాము, కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ బియ్యం గోదాము, చల్లంగిలోని సరళ ఫుడ్స్, తాళ్ళరేవు మండలం యానం రోడ్డు చల్లంగిలోని విష్ణు పట్టాభిరామ ఫుడ్స్, ఆగ్రో ఇండస్ట్రీ, చోల్లంగి విశ్వగోదాము, తురంగిలోని విఎస్.రాజు సన్స్ తదితర బియ్యం గోదాములను అధికారులతో కలిసి బియ్యం నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రెండు రోజుల కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం నుంచి 10 బృందాలు కాకినాడ పట్టణం, కాకినాడ గ్రామీణం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం నిల్వల కేంద్రాలను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి అక్రమంగా విదేశాలకు తరలించే వారిపై సమగ్ర విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని నూటికి నూరు శాతం నిజాయితీగా చేరేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా పనిచేస్తున్న వారిపై చట్టపరకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు నిర్వహించిన పది ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 30-06-2024

## నీట్ ఆన్ లైన్ సాధ్యం కాదా...

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అనంతర పరిణామాలపై చర్చ జరుగుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం 2010 డిసెంబర్ 21న నాటి యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)ను నిర్వహించాలని నిర్ణయించింది. కాగా, అనేక కారణాలు చూపుతూ మోదీ పాలనలో ఉన్న గుజరాత్ మొదలు అనేక రాష్ట్రాలు అప్పట్లో దీనిని తిరస్కరించాయి. తర్వాత.. 2013 నుంచి 2016 మధ్యకాలంలో నీట్ పరీక్షా విధానం లోపభూయిష్టంగా ఉందని, ఇది కొన్ని భాషల, ప్రాంతాల విద్యార్థులకు నష్టం కలిగిస్తోందంటూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, జమ్మూకశ్మీర్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అయితే, దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష వలన అన్ని ప్రాంతాల విద్యార్థులకు సమాన అవకాశాలు వచ్చే అవకాశం ఉందని, 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహిస్తున్నందున అన్యాయం జరిగే అవకాశం లేదంటూ దేశంలోని రాష్ట్రాలన్నీ 'నీట్'లో జాయిన్ కావాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా 'ఆల్ ఇండియా పూల్' ద్వారా తెలంగాణ విద్యార్థులకు ఎంతోకొంత మేలు జరుగుతుందని అప్పట్లో అందరూ భావించారు.అయితే, నీట్ పరీక్ష వల్ల మొత్తంగా తెలంగాణకు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరిగిందని గత ఆరేళ్ల అనుభవాలను బట్టి అర్థమవుతోంది. 2017 నుంచి తెలంగాణ విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తున్నారు. ఈ ఏడాది తెలంగాణ నుంచి ఈ పరీక్షకు 1.4 లక్షలమంది విద్యార్థులు హాజరయ్యారు. తెలంగాణలో 54 మెడికల్ కాలేజీలుండగా, అందులో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 27. రాష్ట్రంలోని మొత్తం మెడికల్ సీట్ల సంఖ్య 8,265 కాగా, అందులో ప్రభుత్వ కాలేజీల్లో ఉన్న సీట్లు 3,815 మాత్రమే. అయితే వీటిలో 15 శాతం సీట్లు.. 'ఆల్ ఇండియా పూల్' కోటా కింద ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పోతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 30 పీజీ వైద్య కళాశాలలుండగా అందులో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 10 మాత్రమే. మొత్తం కళాశాలల్లో 2,978 సీట్లుండగా, ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లు 1,267 మాత్రమే. వీటిలో సగం సీట్లను 'ఆల్ ఇండియా పూల్' కోటా కింద తెలంగాణ విద్యార్థులు కోల్పోతున్నారు. అయితే, ఇక్కడి సీట్లు వేరే రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించినట్లే, వేరే రాష్ట్రాల సీట్లు ఆల్ ఇండియా పూల్ కింద ఉంటున్న సీట్ల వల్ల తెలంగాణ విద్యార్థులకు మేలు జరగటం లేదు. ఎందుకంటే తెలంగాణలోని కాలేజీల్లోని మెరుగైన సౌకర్యాల వల్ల బయటి రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడి కాలేజీలకు టక్కున చేరిపోతుండగా, కనీస సౌకర్యాలు లేని బయటి రాష్ట్రాల మెడికల్ కళాశాలలో సీటొచ్చినా, తెలంగాణ విద్యార్థులు చేరటం లేదు. దీనికి తోడు, ఆర్టికల్ 371-డి ప్రకారం బయటి రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివిన తెలంగాణ విద్యార్థి.. సొంత రాష్ట్రమైన తెలంగాణలో నాన్‌లోకల్‌గానే పరిగణించబడుతున్నాడు. దీంతో బయటి రాష్ట్రపు కాలేజీ సంగతే ఇక్కడి విద్యార్థులు మరిచిపోవాల్సిన దుస్థితి.దేశవ్యాప్తంగా 2018 నాటికి 499 మెడికల్ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 706 అయింది. 2018తో దేశంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 70,012 కాగా, ప్రస్తుతం అది 1,08,940 సీట్లకు పెరిగింది. అయితే, మొత్తం కాలేజీల్లో 270 కాలేజీలు దక్షిణాదిలోని 5 రాష్ట్రాలకు చెందినవే. వీటిలో 43,525 సీట్లున్నాయి. అంటే.. 23 రాష్ట్రాల్లో కాలేజీల సంఖ్య 436 మాత్రమే కాగా వీటిలోని సీట్లు 65,415 మాత్రమే. దక్షిణాదిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నాలుగైదేళ్లకోసారి కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తూ రావటంతో ఇక్కడ మెడికల్ సీట్ల సంఖ్య పెరుగుతోంది. అయితే, ఈ రాష్ట్రాల్లో నీట్ రాసే విద్యార్థుల సంఖ్య మాత్రం ఈ పెద్దగా పెరగలేదు. 2018లో 5 దక్షిణాది రాష్ట్రాల నుంచి 4,24,523 మంది నీట్‌కు హాజరయ్యారు.. 2024 నాటికి ఆ సంఖ్య 5,82,845కు చేరింది. అంటే.. ఏడేళ్లలో 1,58,322 మంది విద్యార్థులే పెరిగారు. దీనికి భిన్నంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ నుంచి నీట్ రాసే విద్యార్థుల సంఖ్య ఏటా వేగంగా పెరుగుతోంది. ఈ 6 రాష్ట్రాల నుంచి 2018లో 4,78,255 మంది విద్యార్థులు నీట్‌కు హాజరుకాగా... 2024లో ఈ సంఖ్య 11,57,180కు చేరింది. ఈ లెక్కలను బట్టి ఉత్తరాదిలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నదే తప్ప కళాశాలల సంఖ్య పెరగడం లేదు. దీంతో వీరంతా దక్షిణాది కాలేజీల మీద ఆధారపడుతున్నారు. దీంతో ఇక్కడి విద్యార్థులకు నష్టం జరుగుతోంది. కేంద్రీకృత విధానంలో కీలక పరీక్షలు నిర్వహించటమూ సమస్యలకు దారితీస్తోంది. ముఖ్యంగా ఎక్కడో బీహార్‌లో 'పేపర్ లీక్' అయితే, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడక తప్పని పరిస్థితి. మనదేశంలో నీట్-యూజీ, జేఈఇ, యూజీసీ-నెట్, సీయూఈటీ వంటి సుమారు 15 ప్రధాన పరీక్షలు నేటికీ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల సేవల మీద ఆధారపడే జరుగుతున్నాయి. సిబ్బంది, ఐటీ సిస్టమ్స్, క్యాబర్ కోడ్స్ వంటి పనులన్నీ ఏజెన్సీల మనుషులే చేస్తున్నారు. ఇటీవల లీకయిన నీట్ ప్రశ్నాపత్రం తాలూకా విచారణలో కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు బయటికొచ్చాయి. అహ్మదాబాద్ నుంచి ఓ ప్రైవేటు కొరియర్ సంస్థ ద్వారా రాంచీకి నీట్ ప్రశ్నపత్రాలు వచ్చాయి. వాటిని అక్కణ్నుంచి స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్‌కి చేర్చి, తర్వాత బ్యాంకు నుంచి ఎగ్జామ్ సెంటర్‌కు చేర్చాల్సి ఉంది. అయితే, సదరు కొరియర్ కంపెనీ రాంచీకి వచ్చిన ప్రశ్నపత్రాలను తన సొంత వాహనంలో తీసుకుపోవాల్సింది పోయి.. ఆ సమయానికి అక్కడ కనిపించిన ఈ-రిక్షాను బుక్ చేసింది. ఇక పరీక్ష మీద థర్డ్ పార్టీ చేసిన రివ్యూలో అనేక లోపాలు బయటపడ్డాయి. అన్ని రాష్ట్రాల్లో కలిపి దాదాపు 4 వేల కేంద్రాల్లో నీట్ పరీక్ష జరగగా, వీటిలో 399 కేంద్రాల్లో ఈ సర్వే జరిగింది. నిబంధనల ప్రకారం.. ప్రతి పరీక్ష కేంద్రపు గదిలో రెండు సీసీ కెమెరాలుండటంతో బాటు వీటిని ఢిల్లీలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలి. కానీ, ఈ సర్వేలో 399 సెంటర్లకు గాను 186 కేంద్రాల్లోని (46%) తరగతి గదుల్లో సీసీ కెమెరాలు పనిచేయలేదు. అలాగే, 68 కేంద్రాల్లో ప్రశ్నపత్రాలు భద్రపరచే స్ట్రాంగ్ రూములకు ఎలాంటి గార్డుల కావలా లేదు. 83 కేంద్రాల్లో.. ఉండాల్సిన బయోమెట్రిక్ సిబ్బందికి బదులుగా వేరే వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు.ఇంత టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో ఎందుకు నిర్వహించటం లేదు? ఏదైనా తప్పు చేసి బ్లాక్‌లిస్టులోకి చేరిన ఔట్ సోర్సింగ్ పరీక్ష నిర్వహణా సంస్థల మీద నామ మాత్రపు చర్యలే గాక మళ్లీ మళ్లీ వారికే పరీక్ష నిర్వహించే బాధ్యతలు ఎలా దక్కుతున్నాయి

# వైసీపీ అలా ఎందుకు...

విజయవాడ, జూన్ 29, లోక్‌సభ స్పీకర్ ఎన్నిక విషయంలో వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు తమ మద్దతు బీజేపీకే అని ప్రకటించడం దేశవ్యాప్త రాజకీయాల్లో కలకలానికి కారణం అయింది. ఎందుకంటే ఎన్డీఏ కూటమిలో టీడీపీ, జనసేన ఉన్నాయి. ఆ రెండు పార్టీలతో కలిసి వైసీపీని భారీ తేడాతో ఓడించాయి. అంతకు ముందు ఐదేళ్ల పాటు బీజేపీకి జగన్మోహన్ రెడ్డి బేషరతు మద్దతు ఇచ్చారు. ఎలాంటి బిల్లు అయినా పార్లమెంట్ లో డిమాండ్లు పెట్టకుండా ఆడిగినా అడగకపోయినా సపోర్ట్ చేశారు. అందుకే తమకు వ్యతిరేకంగా బీజేపీ వెళ్లదని అనుకున్నారు. పొత్తులపై చర్చలు జరుగుతున్నప్పుడు జగన్మోహన్ రెడ్డి స్వయంగా ప్రధాని మోదీని కలిసి తాము ఎప్పటిలాగా మద్దతుగా ఉంటామని టీడీపీ, జనసేనతో కలవొద్దని కోరినట్లుగా ప్రచారం కూడా జరిగింది. కానీ టీడీపీ, జనసేనతో బీజేపీ కలిసిపోయింది. ఇలాంటి సందర్భంలో వైసీపీ బీజేపీని వ్యతిరేకించాల్సింది. కానీ వైసీపీ అధినేత జగన్‌కు మరో ఆప్షన్ లేదన్నట్లుగా బీజేపీకే మద్దతుగా ఉంటున్నారు. తాను బద్ధశత్రువులుగా భావించే టీడీపీ,జనసేన ఉన్న కూటమి అభ్యర్థికే ఏ మాత్రం ఆలోచించకుండా మద్దతు తెలిపారంటే జగన్ ఉన్న అనివార్య పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. కొత్త లోక్ సభ ఏర్పడింది. స్పీకర్ ఎన్నిక జరిగింది. ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పోస్టు ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో బరిలో ఉండాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అభ్యర్థిని కూడా ఖరారు చేశారు. కాంగ్రెస్ తరపున కేరళ ఎంపీ కే.సురేష్ నామినేషన్ వేశారు. అంతే అన్ని పార్టీలు విప్ జారీ చేయడం ప్రారంభించాయి. ఎన్డీఏ కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన విప్ జారీ చేసి.. ఓటింగ్ ఎలా చేయాలో శిక్షణ కూడా ఇచ్చాయి. అయితే నలుగురు ఎంపీలు ఉన్న వైసీపీకి ఇక్కడే సమస్య ఎదురయింది. తాము ఓటింగ్ కు దూరంగా ఉండాలా లేకపోతే బీజేపీ అభ్యర్థికి మద్దతివ్వాలా అని ఆలోచించారు. కానీ బీజేపీకి దూరమయ్యామని భావిస్తే.. కాంగ్రెస్ కు దగ్గరవుతున్నామన్న అభిప్రాయం ఏర్పడుతుంది. అందుకే బీజేపీకే మద్దతివ్వాలని నిర్ణయించుకున్నారు. మీడియాకు సమాచారం ఇచ్చారు. తమను బీజేపీ నేతలు అడిగారని.. తాము మద్దతిచ్చేందుకు అంగీకరించామని చెప్పారు. ఇది రాజకీయాల్లో చర్చనీయాంశమయింది. బీజేపీకి కూటమికి మరో నలుగురు ఎంపీల మద్దతు పెరిగినట్లయిందని ఖరారు చేశారు. కేంద్రంలో ఏ పార్టీ అధికారం? ఉంటే ఆ పార్టీకి వైసీపీ మద్దతివ్వక తప్పని పరిస్థితి. వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఉన్న అనివార్య పరిస్థితి అది. ఆయనపై సీబీఐ, ఈడీ కేసులు ఉన్నాయి. వాటి విచారణ కోర్టుల్లో ఉంది. పన్నెండేళ్లుగా ట్రయల్ కు రాని కేసులన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో వైఎస్ వివేకా హత్య కేసు కూడా ఉంది. అధికారంలో ఉండటం వల్ల అవినాష్ రెడ్డిని అరెస్టు కాకుండా అతి కష్టం మీద కాపాడగలిగారు. ఇప్పుడు బీజేపీకి వ్యతిరేకంగా వెళ్తున్నామన్న సంకేతాలు వస్తే పరిస్థితులు ఒక్కసారిగా తిరగబడతాయి. బీజేపీ కనీస మెర్సీ చూపించదన్న సంకేతాలు ఉన్నాయి. అందుకే జగన్మోహన్ రెడ్డి నైతికత.. అనైతికత అనేదాని గురించి ఆలోచించకుండా.. వెంటనే బీజేపీకి మద్దతు పలికేశారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఓటింగ్ వరకూ వెళ్లలేదు. మూజువాణి ఓటుతో ముగిసిపోయింది. బీజేపీకి మద్దతుగా పార్లమెంట్ లో ఓటు వేయాల్సిన అవకాశం రాలేదు. అవసరంగా ముందే బీజేపీకి మద్దతు ఇవ్వామని ప్రకటించడం ద్వారా తాము బీజేపీ వైపు ఉన్నామన్న సంకేతాలను బహిరంగంగా పంపినట్లయింది.. అంతేనా.. స్పీకర్ ఎన్నిక జరగగానే .. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పీకర్ ను చెయిర్ వద్దకు తీసుకెళ్లారు. ఇది వైసీపీని మరింత ఇబ్బంది పెట్టింది. ఎందుకంటే అసెంబ్లీలో జగన్ స్పీకర్ ఎన్నిక ప్రక్రియలో పాలు పంచుకోలేదు. ఇది కూడా ప్రజల్లో చర్చనీయాంశం అయింది. ఓ వైపు టీడీపీ, జనసేనతో కలిసిన కూటమికి స్పీకర్ ఎన్నికలో మద్దతివ్వడం .. కనీసం బాయ్ కాట్ చేయలేని నిస్సహాయతతో ఉండటం ప్రజల్ని కూడా విస్మయానికి గురి చేసింది. రాజ్యసభలో ఇప్పటికీ వైసీపీకి పదకొండు మంది సభ్యులు ఉన్నారు. వారంతా ఇక చెప్పాల్సిన పని లేకుండా బీజేపీకే మద్దతుగా ఉంటారు. అంటే.. టీడీపీ, జనసేనతో కలిసిన బీజేపీకి వ్యతిరేకంగా వెళ్లేందుకు వైసీపీ సిద్ధంగా లేదన్నమాట.ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో టీడీపీకి కీలక పాత్ర, బీజేపీ తర్వాత అతి పెద్ద పార్టీ. టీడీపీని శత్రువులా చూసేది వైసీపీ. ఐదేళ్ల కాలంలో టీడీపీని వైసీపీ అధినేత జగన్ ఎంత టార్చర్ పెట్టారో చెప్పాల్సిన పని లేదు. అంతకు మించి చూపించాలని టీడీపీ హైకమాండ్ పై క్యాడర్ ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి సమయంలో వైసీపీ పాలనలో జరిగిన అక్రమాల గురించి విచారణలు చేయక తప్పదు. ఒక్క డిజిటల్ కార్పొరేషన్ పేరుతోనే పద్దెనిమిది వందల కోట్ల రూపాయల స్వాహా చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. వీటన్నింటిపై విచారణ చేస్తే.. జగన్ సహా అనేక మందికి అరెస్టు ముప్పు ఉంటుంది. సీబీఐ, ఈడీ కేసులకు ఇవి అదనం అవుతాయి. అయితే బీజేపీకి సపోర్టుగా ఉంటున్నందున బీజేపీ కాపాడుతుందని.. వైసీపీ నేతలు గట్టి నమ్మకంతో ఉన్నారని అందుకే సపోర్టు అడగకపోయినా ప్రకటిస్తున్నారని చెబుతున్నారు. భవిష్యత్ రాజకీయాలు ఎలా ఉంటాయో కానీ.. వైసీపీ అధినేత జగన్ మాత్రం.. ఢిల్లీలో ఎవరు అధికారంలో ఉంటే వారికి దాసోహం అంటారన్న భావన మాత్రం పెరుగుతోంది.

# కనిపించని సజ్జల...



గుంటూరు, జూన్ 29, సజ్జల రామకృష్ణారెడ్డి ఏమయ్యారు? ఎక్కడున్నారు? గతంలో వైసీపీ పాలనలపై పరిగెత్తి మరీ ప్రెస్‌మీట్లు పెట్టిన సజ్జల ఎందుకు కనిపించడం లేదు? ఏపీ రాజకీయాల్లో ఇవే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొడాలి నాని, పేర్నినాని, రోజా, అమర్నాథ్, అంబటి రాంబాబు లాంటివారు గతంలో వైసీపీ తరఫున ప్రెస్‌మీట్లు పెట్టేవారు. అయితే, వీరంతా కేవలం పవన్, చంద్రబాబు, లోకేష్ ను తిట్టడానికే పరిమితం అయ్యేవారు. పాలసీలపై మాట్లాడటానికి మాత్రం వీళ్లు దూరంగా ఉండేవారు. వీరంతా జగన్ కేబినెట్‌లో మంత్రులుగా చేసినప్పటికీ.. వారి శాఖలకు సంబంధించిన పాలసీ వ్యవహారాలపై మాత్రం సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే మాట్లాడేవారు. పార్టీ, ప్రభుత్వ విధివిధానాలు ఆయనే చెప్పేవారు.కానీ.. అధికారం చేతులు మారిన తర్వాత సజ్జల కనిపించడం లేదు. పార్టీకి సంబంధించిన అంశాలు కూడా మాట్లాడం లేదు. జగన్‌కు ప్రతిపక్ష హోదా, కాంగ్రెస్‌లో వైసీపీ విలీనం లాంటి వార్తలపై కూడా ఆయన స్పందించడం లేదు. ఇలాంటి కీలకమైన అంశాలపై పేర్ని నాని మొన్న ప్రెస్‌మీట్ పెట్టారు. దీంతో.. జగన్ ప్రియారిటీలను మార్చుకున్నారా? సజ్జలను దూరం పెట్టారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సజ్జల వలనే ఓడిపోయామనే ప్రచారాన్ని జగన్ కూడా నమ్మారా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.వైసీపీ ఓటమికి కారణమేంటని ప్రశ్నిస్తే సొంత పార్టీ వాళ్లు కూడా చెప్పే మొదటి పేరు సజ్జల రామకృష్ణారెడ్డి. గ్రౌండ్ లెవెల్ వాస్తవాలను జగన్‌కు తెలియకుండా సజ్జల ఓ సైంధవుడిలా వ్యవహరించారని ఇంటా బయటా వినిపిస్తున్న మాట. ఎన్నికలకు ముందే ఈ విషయం చాలా మంది వైసీపీ నాయకులు చెప్పినా.. జగన్ వినలేదు. సజ్జలపై తీవ్రమైన ఆరోపణలు చేసి కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రాంనారాయణ రెడ్డి లాంటి వారు బయటకు వచ్చారు. అప్పుడు జగన్ తన మంత్రులు, ఎమ్మెల్యేలతో శ్రీధర్ రెడ్డి, ఆనం రాంనారాయణ రెడ్డి లాంటివారిపై మాటల దాడి చేయించారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా చాలా మంది వైసీపీ నేతలు సజ్జలవైపే చూపిస్తున్నారు. మొన్నటికి మొన్న గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి కూడా సజ్జలపై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. గ్రౌండ్ విషయాలు తమ అధినేతకు తెలియకుండా సజ్జల చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులు జగన్ కు కలిసేందుకు కూడా అవకాశం లేకుండా ఓ గోడలా సజ్జల అడ్డంగా ఉన్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో మంత్రులు మితిమీరి మాట్లాడినా.. అడ్డుకోవాల్సిన సజ్జల వారిని ప్రోత్సహించారని అన్నారు. అందుకే వైసీపీ ఇంత ఘోరంగా ఓడిపోయిందని చెప్పారు. అయితే.. ఇది ఒక్క కాసు మహేష్ రెడ్డికే పరిమితం కాలేదు.పార్టీలో నేతలంతా పరోక్షంగానో ప్రత్యక్షంగానో ఓటమికి ప్రధాన కారణం సజ్జల అని అంటున్నారు. అయితే కొంతమంది ధైర్యంగా వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది లోలోపల గుసగుసలాడుతున్నారు. పార్టీలోనే కాకుండా ప్రత్యర్థులు కూడా సజ్జల తీరుపై చాలా ఏళ్లుగా విమర్శలు చేస్తూనే వస్తున్నారు. పేరుకే జగన్ కేబినెట్‌లో మంత్రులున్నారే కానీ.. వారి వ్యవహారాలన్నీ సజ్జలే చూస్తున్నారని ప్రత్యర్థులు విమర్శలు చేస్తూ వచ్చేవారు. కానీ, జగన్ మాత్రం ఇవన్నీ రాజకీయ విమర్శలుగానే చూశారు తప్పా.. అందులో నిజమెంత ఉందో తెలుసుకోలేకపోయారు. చివరికి ఓటమి తర్వాత ఆయనకు తత్వం బోధపడిందని అంటున్నారు. అందుకే సజ్జలను పక్కన పెట్టారని చెబుతున్నారు.అయితే.. మరో వెర్షన్ కూడా వినిపిస్తోంది. ఎవరో ఏదో చెబితే వినే తత్వం జగన్ ది కాదని అంటున్నారు. నిజంగానే ప్రత్యర్థులో, పార్టీ నేతలో చెప్పే వినే పరిస్థితుల్లో జగన్ ఉంటే ఈ స్థాయి ఓటమిని మూటకట్టుకునే వారు కాదనే వాదనలు కూడా ఉన్నాయి. కానీ, సజ్జలను జగన్ పక్కన పెట్టడం కాదని.. జరగాల్సిన నష్టం జరిగిన తర్వాత సైలెంట్‌గా సజ్జలే సైడ్ అయ్యారని వైసీపీ నేతల్లో ఓ వర్గం చెబుతోంది. అందులో భాగంగానే తన కొడుకు సజ్జల భార్గవ్ రెడ్డిని కూడా సోషల్ మీడియా బాధ్యతలను నుంచి తప్పించారనే ప్రచారం జరుగుతోంది. ఈ వాదనల్లో నిజం ఏదైనా.. సజ్జల, జగన్ మధ్య కాస్త గ్యాప్ పెరిగిందన్నది వాస్తవంగా తెలుస్తోంది.

## నీరు ఏదీ... నాట్లు ఎక్కడ...

కాకినాడ, జూన్ 29, రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. నైరుతి రుతుపవనాలు అనుకున్న సమయానికి ముందే రాష్ట్రాలలోకి ప్రవేశించినప్పటికీ వర్షాలు సమృద్ధిగా పడటం లేదు. జూన్, జులై నెలలో కూడా ఇలాగే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. తుఫానులు వస్తే తప్ప భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు లేవన్నది వాతావరణ శాఖ చెబుతున్న మాట. ఇది అన్నదాతలకు ఆందోళనకు కలిగించే విషయం. ప్రాజెక్టులకు నీరు వచ్చి చేరడం లేదు. సాగుచేద్దామంటే ధైర్యంచాలడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితులు ఇప్పుడు తలెత్తాయని రెండు తెలుగు రాష్ట్రాలలో రైతులు ఆవేదన చెందుతున్నారు.సాధారణంగానికి ఏటా జూన్, జులై నెలల్లో భారీ వర్షాలు కురిసి జలకళను ప్రాజెక్టులు సంతరించుకుంటాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల కింద సాగయ్యే లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందాలంటే భారీ వర్షాలు పడి ప్రాజెక్టులు నిండాల్సిందే. కొన్ని సార్లు గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ ఈ ఏడాది మాత్రం ప్రకృతి కోపించిందనే అనుకోవాలి. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులలో నీరు తగినంతగా లేకపోవడంతో సాగు నీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జులై నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. అందుకోసం దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసుకోవాల్సిన సమయంలో నీరులేకపోవడంతో అధికారులు కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గత నలభై ఏళ్లలో కృష్ణా నదిలో ఇంత తక్కువ నీరు ఎప్పుడూ లేదంటున్నారు. నీరు ఈ ఏడాది అందడం కష్టమేనని చెబుతున్నారు. ఆగస్టు నెల నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ అప్పటికి ఏంజరుగుతుందోనన్న టెన్షన్ రైతుల్లో ఉంది. దుక్కులు దున్ని నాట్లు వేసుకుంటే నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. అసలే ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో సమయానికి నీరు అందుతుందా? లేదా? అన్న టెన్షన్ మొదలయింది. అదే సమయంలో వర్షాలు కూడా చినుకులు పడి వెళుతున్నాయి. ఇది తమకు ఎంత మేరకు ఉపయోగపడుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరుణుడు కరుణించి భారీ వర్షాలు కురిస్తే తప్ప జలాశయాలు నిండవు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడితేనే కింద ఉన్న జలాశయాలకు నీరు చేరేది. మరి ఈ ఏడాది సాగు పై అనుమానపు మేఘాలు అలుముకున్నాయి.కేంద్ర ప్రభుత్వం తన రెండో కేబినెట్ లో రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలను తీసుకుంది. మూడో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం తొలి సంతకం పీఎం కిసాన్ సమ్మాన్ నిధుల విడుదలపైనే సంతకం చేశారు. ఇరవై వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారు. తాజాగా జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలోనూ రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలను తీసుకున్నారు. 14 రకాల పంటలకు... వరి, రాగి, మొక్కజొన్న, పత్తితో సహా పప్పులకు పంటలకు కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచాలని కేబినెట్ భేటీలో నిర్ణయం తసీ?కున్నారు. దీంతో క్వింటా వరి ధర 2,300 రూపాయలకు చేరింది. పంటల ఉత్పత్తి కన్నా 1.5 రెట్లు కనీస మద్దతు ధరను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. నూనెగింజలు, పప్పు ధాన్యాలకు కూడా మద్దతు ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# జగన్ కేరాఫ్ బెంగళూరు ప్యాలెస్

అనంతపురం, జూన్ 29, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. ఏపీ మాజీ సీఎం. మొన్నటి వరకు తాడేపల్లిలో ఉండేది ఆయన నివాసం. ప్రస్తుతం ఆయన కేరాఫ్ అడ్రస్ మాత్రం బెంగళూరులోని యలహంక ప్యాలెస్. అవును.. ఆయన ఆ ప్యాలెస్ దాటి రావడం లేదు.. ఎవ్వరిని కలవడం లేదు. ఏపీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు జగన్ చెప్పిన మాటలు ఇవి. 2019 ఎన్నికల్లో గెలిచినట్టు 151 సీట్లతో మనం సర్దుకుపోవద్దు. ఈసారి.. అంటే మొన్న జరిగిన ఎన్నికల్లో 175 సీట్లు సాధించాల్సిందే. దీని కోసం ఆయన అనేక మార్పులు చేర్పులు చేశారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాలను మార్చేశారు. కొత్త వారిని చేర్చారు. పాతవారిని మార్చేశారు. మరి ఇంతా చేస్తే ఏం జరిగింది. ప్రజలు జగన్‌నే మార్చేశారు. 175 దేవుడెరుగు.. ఏకంగా 11కు పడిపోయింది సీట్ల సంఖ్య. జగన్ ఏం మాట్లాడలో ప్రజలు మర్చిపోయినా.. ఆయనకైతే గుర్తుండి ఉండే ఉంటుంది కదా. నేను ఊహించింది ఏంటి? జరిగింది ఏంటి? అనే డైలమాలో ఉండిపోయారు జగన్. తాడేపల్లి నుంచి మకాం ఫస్ట్ పులివెందులకు షిఫ్ట్ అయ్యింది. ఆ తర్వాత అటు నుంచి అటే బెంగళూరుకు వెళ్లిపోయారు. నిజానికి మొదట అందరూ అనుకున్నది ఏంటంటే.. జగన్‌పై ఇక్కడైతే నిఘా ఉంటుంది. అదే బెంగళూరులో అయితే అలాంటి ఇబ్బందులు ఉండవు. అక్కడే జగన్ కీలక నేతలతో కలిసి వ్యూహాలు రచిస్తారని అంతా ఊహించారు. కానీ.. అక్కడ ఇది కూడా జరగడం లేదు. జగన్‌తో నేతలు కూడా భేటీ అవ్వడం లేదు. కాబట్టి వ్యూహ రచన ఏం జరగడం లేదు. మరి బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లో జగన్ ఏం చేస్తున్నారు?జగన్ బెంగళూరుకు వెళ్లడానికి రెండు కారణాలు ఉండి ఉండాలి. ఒకటి.. ఓటమి తర్వాత ఎవ్వరికి ముఖం చూపించుకునే పరిస్థితి లేకపోవడం. రెండవది.. ఐదేళ్ల పాటు సీఎంగా తెగ కష్టపడ్డాను కాబట్టి.. మనసుకు, శరీరానికి కాస్త రెస్ట్ కావాలని కోరుకోవడం. ఈ రెండు కారణాలలో ఏదో ఒక కారణంతోనే ఆయన బెంగళూరుకు షిఫ్ట్ అయ్యి ఉండాలి. కానీ రెస్ట్ కోసమే ఆయన బెంగళూరుకు వెళ్లే చాన్స్ అయితే లేదు. ఎందుకంటే ఎన్నికలు ముగియగానే ఆయన లండన్ వెళ్లారు. కుటుంబంతో సహా కొన్ని రోజుల పాటు ఆయన వివిధ దేశాలను చుట్టి వచ్చారు. చాలా రిలాక్సేషన్ తర్వాతే ఆయన తిరిగి ఇండియాకు వచ్చారు. ఆయన మళ్లీ రెస్ట్ కోసమే బెంగళూరుకు వెళ్లే పరిస్థితి అయితే లేదు. అయితే జగన్ ఓటమిని తట్టుకోలేకే బెంగళూరుకు తన కేరాఫ్ అడ్రస్‌ను మార్చేశారని తెలుస్తుంది.జగన్‌కు తాడేపల్లిలో ఓ ఇల్లు ఉంది. ఆ తర్వాత సొంత గడ్డ పులివెందులలో మరో ఇల్లు ఉంది. కానీ ఈ రెండింటిలో దేనిని చూస్ చేసుకోలేకపోయారు. తాడేపల్లి అనేది అమరావతిలో ఉన్న ప్రాంతం. అక్కడ జగన్ అంటే నచ్చేవారు, మెచ్చేవారు ఎవరూ లేరు. అధికారంలో ఉన్నప్పుడు తన ఇంటి పరిసరాలవైపు ఎవ్వరిని రానివ్వలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి లేదు. అక్కడికి ఎవ్వరూ వచ్చినా.. ఏ నేతతో మాట్లాడినా.. వారి మొఖాల్లో 11 నెంబర్ కనిపిస్తుంది.అంతేకాదు.. ఎప్పుడు ఏ వైపు నుంచి నిరసన వ్యక్తమవుతుందో తెలియని పరిస్థితి. అందుకే పులివెందులలో పర్యటన పెట్టుకున్నారు. అక్కడ కూడా అదే పరిస్థితి.వైసీపీకి మంచి పట్టున్న ప్రాంతం రాయలసీమ అనే ముద్ర ఉండేది. ఈ ఎన్నికల దెబ్బకు ఆ ముద్ర కూడా చెరిగిపోయింది. పులివెందులలో తనను కలిసే నేతలు, అనుచరులను చూస్తుంటే ఆయనకు ఓటమి బాధ మరింత ఎక్కువవుతున్నట్టు తెలుస్తుంది. అందుకే ఒంటరిగా ఉండేందుకే ఆయన యలహంక ప్యాలెస్‌కు వెళ్లారని తెలుస్తుంది. అక్కడైతేనే తన మనసుకు కాస్త ప్రశాంతత దొరుకుతుంది. అక్కడైతేనే ఎలాంటి గోల ఉండదు. ప్రభుత్వ నిఘా ఉండదు. నిరసనల బాధ లేదు.. పరామర్శల గోల లేదు. మొత్తానికి తన దారుణ ఓటమిని మర్చిపోయేందుకు టైమ్ దొరుకుతుంది. అసలు ఈ ఎన్నికలే జరగలేదు.. ఆ ఎన్నికల్లో నేను పోటీ చేయలేదు. 11 సీట్లు రాలేదు.. అనే ఫీలింగ్ కోసమే జగన్ యలహంక ప్యాలెస్‌కు చేరినట్టు అర్థమవుతుంది.

## నేతలపై కేసులు తిరగదోడుతున్నారు...

విజయవాడ, జూన్ 29, వైసిపి ముఖ్య నేతలపై రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ చేసిందా? గత ఐదేళ్లలో వైసిపి నేతలపై నమోదైన కేసుల స్టేటస్ రిపోర్టు కోరిందా? ముఖ్య కేసులను రీఓపెన్ చేస్తోందా? అదే జరిగితే వైసిపి ముఖ్య నేతల చుట్టూ ఉచ్చు బిగియనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఈ పాత కేసుల్లో సజ్జలతో సహ వైసిపి కీలక నేతలు ఉన్నారు. దీంతో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. జగన్ సర్కార్ హయాంలో రాజకీయంగా అనేక కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల వివరాలు పైన కొత్త ప్రభుత్వం ఆరా తీస్తోంది.ఉండవల్లి లోని చంద్రబాబు ఇంటిపై మాజీ మంత్రి జోగి రమేష్ దండయాత్ర చేసిన సంగతి తెలిసిందే. అప్పటి సీఎం జగన్ పై చంద్రబాబు కామెంట్స్ చేశారని ఆరోపిస్తూ భారీ వాహన శ్రేణితో ఉండవల్లి లోని చంద్రబాబు నివాసం పై జోగి రమేష్ దండయాత్ర చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో టిడిపి నేతలు ప్రతిఘటించారు కూడా. అయితే అప్పట్లో చిన్నపాటి కేసు మాత్రమే నమోదయింది. ఇప్పుడు అదే కేసులో జోగి రమేష్ తో పాటుగా వైసిపి ముఖ్య నేతలపై విచారణ జరిగే అవకాశం ఉంది.టిడిపి కేంద్ర కార్యాలయం పై వైసీపీ శ్రేణులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పార్టీ కార్యాలయంలో అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం అయింది. అప్పట్లో సంచలనంగా మారింది. దేవినేని అవినాష్, అప్పి రెడ్డి కను సన్నల్లో ఈ దాడి జరిగినట్లు అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. ఆ సమయంలోనే సీఎంగా ఉన్న జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు బీపీ వస్తే ఇలాంటి ఘటనలే జరుగుతాయని తేల్చి మాట్లాడారు. డిజిపి సైతం చిన్నపాటి ఘటనగా చెప్పుకొచ్చారు.

# పట్నాయక్ ఎఫెక్ట్....

## బీజేపీకి మద్దతుగా వైసీపీ...

నెల్లూరు, జూన్ 29, ఃకేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ లోక్‌సభలో మిత్రపక్షాలపై ఆధారపడి పని చేయాల్సి ఉంది. ప్రధానంగా లోక్‌సభలో టీడీపీ, జేడీయూల మద్దతుతోనే మోదీ ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇద్దరు సీనియర్ నేతలు... ఒకరు నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు కాగా, మరొకరు సీనియర్ నేత బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లు. ఇద్దరి చేతుల్లోనే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం భవితవ్యం ఆధారపడి ఉంది. ఇది లోక్‌సభలో పరిస్థితి. కానీ రాజ్యసభలో అయితే ఇందుకు సీన్ రివర్స్ లో ఉంది. అక్కడ వైసీపీ అవసరం బీజేపీ కేంద్రనాయకత్వానికి ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. మొన్నటి వరకూ బిజూ జనతా దళ్ నేత నవీన్ పట్నాయక్ బీజేపీ ప్రభుత్వానికి సహకరించేవారు. బయట నుంచి మద్దతిచ్చేవారు. వైసీపీ తరహాలోనే బీజేడీ కూడా అన్ని బిల్లులకు రాజ్యసభలో మద్దతిస్తూ వస్తుంది. దీంతో మొన్నటి వరకూ ఇటు వైసీపీ, బీజేడీ వంటి పార్టీల మద్దతుతో రాజ్యసభలో అధికార బీజేపీ బిల్లులను ఆమోదించుకుంటూ వచ్చింది. ఎలాంటి ఇబ్బందులు పదేళ్ల పాటు ఎదురు కాలేదు. కానీ ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ చీఫ్ నవీన్ పట్నాయక్ రివర్స్ అయ్యారు. రాజ్యసభలో ప్రజల పక్షాన పోరాడాలని తమ పార్టీ సభ్యులకు పిలుపు నిచ్చారు. బలమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని ఆయన సిద్ధమయ్యారు. రాజ్యసభలో బిజూ జనతా దళ్ కు 9 మంది సభ్యులున్నారు. ఇది పెద్ద సంఖ్య. నవీన్ పట్నాయక్ రివర్స్ నిర్ణయంతో ఇప్పుడు బీజేపీ చూపు వైసీపీపై పడిందని అంటున్నారు. రాజ్యసభలో వైసీపీకి పదకొండు మంది సభ్యులున్నారు. 2026 వరకూ ఎవరూ పదవీ విరమణ చేసే పరిస్థితి లేదు. అదే సమయంలో ఎన్డీఏలో కూటమిగా ఉన్న తెలుగుదేశం పార్టీకి రాజ్యసభలో ఒక్క సభ్యుడు కూడా లేరు. దీంతో వైసీపీ పై ఆధారపడాల్సిన పరిస్థితి బీజేపీ?కి ఏర్పడింది. ఏమాత్రం కాదన్నా జగన్ అడ్డం తిరిగితే బిల్లులు ఆమోదం పొందడం అసాధ్యమవుతాయి. పెద్దల సభలో బీజేపీకి మెజారిటీ రావాలంటే ఇప్పట్లో సాధ్యం కాదు. అప్పటి వరకూ ఇతర పార్టీల మద్దతుతోనే బిల్లులను ఆమోదం పొందాల్సి ఉంటుంది. అంతే తప్ప వైసీపీని దూరం చూసుకునే పరిస్థితి లేదు. బిజూ జనతాదళ్ అంటే రాష్ట్రంలో అక్కడ బీజేపీ అధికారంలోకి రావడంతో పాటుగా, ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శల తోనే నవీన్ పట్నాయక్ బీజేపీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. 2024 వరకూ ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అన్ని పార్టీలు బీజేపీకి మద్దతు ప్రకటించాల్సి వచ్చేవి. నాడు బీజేపీకి లోక్‌సభలో బలం ఉండటంతో పాటు కాంగ్రెస్ బలహీనంగా ఉందని భావించి అన్ని పార్టీలూ బీజేపీకి సలాం కొట్టాయి. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అన్ని పార్టీలతో సఖ్యతగా తాను ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ, జనసేనలు ఎటూ తమ కూటమిలో సభ్యులుగా ఉన్నప్పటికీ వాటిని జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. అలాగే జగన్ పార్టీ అవసరం రాజ్యసభలో ఉండటంతో వైసీపీని కూడా బీజేపీ నిర్లక్ష్యం చేయడం తగదు. ఇక బీజేపీ ముందు ఉన్న ఒకే ఆప్షన్ ఏంటంటే.. రాజ్యసభ సభ్యులను అవసరమైనంత మేరకు తన పార్టీలోకి లాగేసుకోవడం. అది ఎంతవరకూ సాధ్యమన్నది మాత్రం చెప్పలేని పరిస్థితుల్లో జగన్ ను మాత్రం కమలం పార్టీ వదులుకోలేని పరిస్థితులే ప్రస్తుతం నెలకొన్నాయన్నది వాస్తవం.

# ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడండి

## - యుటియఫ్ వినతి

బద్వేలు,ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో నెంబర్ 117 ను రద్దు చేసే విధంగా ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తీసుకురావాలని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్. శ్రీనివాసులు రెడ్డిని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. శనివారం ఉదయం కడపలోని శ్రీనివాసులు రెడ్డి నివాసంలో యుటిఎఫ్ నాయకులు ఆయనను కలిసి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయవలసిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 117 ను రద్దుచేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యధావిధిగా కొనసాగిస్తామని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను పాత పద్ధతి లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలలు ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు, ప్లస్ టు వరకు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక విద్య మాతృభాషలోను,ఉన్నత విద్య తెలుగు మరియు ఆంగ్ల మాధ్యమాల్లో కొనసాగించాలని తెలిపారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను గుర్తించి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు కొనసాగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నెంబర్ 117 ను వెంటనే రద్దు చేసి వీలైనంత త్వరగా డీఎస్సీ నియామకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేసి కొత్తగా నియామకం అయ్యే ఉపాధ్యాయులకు పూర్తి వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్ మరియు గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రెగ్యులర్ వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల కు దూరం చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని అనవసర యాప్ లన్నింటినీ రద్దు చేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిలన్ని చెల్లించి కొత్త పిఆర్సి ని ప్రకటించే విధంగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సివి రమణ చింతకొమ్మదిన్నె మండల అధ్యక్షుడు కేదార్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ సీఐడీ చీఫ్‌గా రవిశంకర్

విజయవాడ, జూన్ 29, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఉన్నతాధికారుల బదిలీలను బాగా చేపడుతోంది. తాజాగా మరోసారి ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ముగ్గురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కీలకమైన సీఐడీ చీఫ్‌గా విశాఖ పట్నం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్‌ను నియమించింది. ఇప్పుడు సీఐడీ ఇన్‌ఛార్జ్ చీఫ్‌గా ఉన్న హరీష్ కుమార్‌ను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా కొనసాగించనున్నారు.

# రివెంజ్ రాజకీయాలేనా....

విశాఖపట్టణం, జూన్ 29, ఏపీలో రివేంజ్ రాజకీయాలు ఉండవని చంద్రబాబు ప్రకటించారు. కానీ వస్తూ వస్తూ మంగళగిరిలోని వైసీపీ కేంద్ర కార్యాలయం కూల్చివేతతో పాలన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైసీపీ కార్యాలయాలకు నోటీసులు ఇచ్చారు. ఎందుకు కూల్చకూడదో సమాధానం ఇవ్వాలని వాటిలో పొందుపరిచారు. ఏపీలో ప్రతీకార రాజకీయాలు ఉండవని ఒకవైపు ప్రకటిస్తూనే.. తెర వెనుక సామ, దాన దండోపాయాలను ప్రయోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఐదు సంవత్సరాలుగా విధ్వంసకర పాలన అంటూ ప్రజల్లోకి వెళ్లిన వారే.. అధికారంలోకి వచ్చాక అదే తరహా పాలన ప్రారంభించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఆదర్శం మాటల వరకే పరిమితం అయిందని.. చేతలు చెయ్యి దాటి పోతున్నాయని కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొద్ది రోజులపాటు పాలనపై దృష్టి సారిస్తే గత ప్రభుత్వ వైఫల్యాలు వాటంతట అవే బయటపడతాయని.. కానీ టిడిపి కూటమి దూకుడు మున్ముందు ఇబ్బందికర పరిస్థితులు తెచ్చిపెడతాయని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలపై కేసులు, చార్జ్ షీట్లు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వంలో నిర్ణయాలపై క్యాబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి లోటుపాట్లు బయటకు తీయాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు వైసీపీలో కీలక నేతలుగా ఉన్న వారిపై రాజకీయంగా టార్గెట్ చేసుకున్నారు. మద్యం, ఇసుక కుంభకోణాలు అంటూ దర్యాప్తులు ప్రారంభించారు. ఏపీ బేవరేజెస్ చైర్మన్ వాసుదేవరెడ్డి ఇంట్లో కీలక తనిఖీలు చేశారు. మరోవైపు అధికారులను పెద్ద ఎత్తున బదిలీ చేశారు. 19 మంది ఐఏఎస్ అధికారులపై ఒకేసారి బదిలీ వేటు వేశారు. నలుగురు కీలక అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా మొండి చేయి చూపారు. మాజీ సీఎం జగన్ తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులైన సజ్జల రామకృష్ణారెడ్డి, వై వి సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.. ఇలా మొత్తం జగన్ అస్మదీయుల చుట్టూ ఉచ్చు బిగిస్తున్నారు. ఏ చిన్న అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, కొన్ని కీలక ప్రాజెక్టులలో వీరి పాత్ర ఏంటి అన్నది పూర్తి ఆరా తీస్తున్నారు. ప్రధానంగా గత ఐదేళ్లుగా ప్రభుత్వం మద్యం విధానంపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వంలో ఆ నలుగురు పెద్దల పాత్ర ఇందులో ఉందని అనుమానిస్తున్నారు. పక్కా ఆధారాలను సేకరిస్తున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలని.. ఆ కుటుంబాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని గట్టి వ్యూహం పన్నుతున్నారు. అసలు పుంగనూరులో పెద్దిరెడ్డి అడుగుపెట్టకుండా చేయాలని భావిస్తున్నారు. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ తో పాటు కౌన్సిలర్లను టిడిపి వైపు వచ్చేలా అన్ని రకాల ఒత్తిడిలు చేశారు. ఒత్తిళ్లకు తలొగ్గి వారు టిడిపి వైపు వచ్చేందుకు కూడా సిద్ధపడ్డారు. వైసీపీ నేతలు నోరు తెరవకుండా కేసుల పేరుతో వారిని భయపెడుతున్నారు. బహిరంగంగా మాట్లాడేందుకు కూడా వారు భయపడుతున్నారు. వైసీపీలో ఫైర్ బ్రాండ్లు గా ఉన్నవారు సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయేలా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గత ఐదు సంవత్సరాల విధ్వంసకర పాలన అంటూ విపక్షాలు చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మారు. వైసీపీని అధికారానికి దూరం చేశారు. అధికార పీఠంపై కూటమిని నిలబెట్టారు. కానీ అదే పందాను కూటమి ప్రభుత్వం సైతం అనుసరిస్తుండడాన్ని మాత్రం ప్రజలు గమనిస్తున్నారు. మున్ముందు ఇదే దూకుడుతో ముందుకు సాగితే.. కూటమి ప్రభుత్వం సైతం ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకోవడం ఖాయం. అది ఎంతో దూరంలో లేదు. ఆలోచించుకోవాల్సింది చంద్రబాబుతో పాటు పవనే. పగ ప్రతీకార రాజకీయాలకు దూరంగా ఉండి సజావుగా పాలన సాగిస్తే ప్రజల మన్ననలు అందుకుంటారు. లేకుంటే మూల్యం తప్పదని విశ్లేషకులు సైతం హెచ్చరిస్తున్నారు.

# ఏడాది ముందే... రెడ్ సిగ్నల్



## లైట్ తీసుకున్న జగన్

తిరుపతి, జూన్ 29,2024 శాసనసభ ఎన్నికల్లో తాము ఎలా తీర్పు చెప్పబోతున్నామో జనం ఒక ఏడాది ముందే చెప్పారు. కానీ వైసీపీ అధినేత జగన్ కు మాత్రం అర్థం కాలేదు. అర్థం అయినా పట్టించుకోలేదనుకోవాలి. జనం స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. మేం ఇచ్చే తీర్పు ఇదే అని కుండబద్దలు కొట్టారు. అయినా అలివిమాలిన మొండితనం అహం దానిని జీర్ణం చేసుకోవడానికి జగన్ కు అడ్డం వచ్చినట్లుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్నట్లు తీరా శాసనసభ ఎన్నికలు అయిపోయిన తర్వాత బాధపడి ఏం లాభం? మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాలు వచ్చినప్పుడే జగన్ మేలుకుని ఉంటే ఇంత దారుణమైన ఓటమిని మాత్రం ఖచ్చితంగా జగన్ చవి చూసేవారు కాదు. పట్టభద్రుల ఎన్నికల్లో మూడు చోట్ల ఓటమికి గల కారణాలను లోతుగా పరిశీలించి ఉంటే ఇంతటి పరిస్థితి పార్టీకి పట్టేది కాదు. అవును.. ఎవరు మర్చిపోయినా.. జగన్ గుర్తుకు తెచ్చుకోవాలి. శాసనసభ ఎన్నికలకు ఏడాదిన్నర ముందుగానే రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. మూడు ప్రాంతాలు అంటే దాదాపు రాష్ట్రమంతటా ఆ ఎన్నికల ఫలితాలు ప్రజానాడిని ప్రతిబింబిస్తాయి. ఒకరకంగా జగన్ కు ఆ ఎన్నిక మంచి చేయాల్సి ఉంది. ఎందుకంటే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ అధికార వైసీ?పీ ఓటమి పాలయింది. అప్పటి వరకూ ఓటమి అన్న మాట ఎరుగని జగన్ అండ్ కో దానిని తేలిగ్గా తీసిపారేశారు. పేరుకు పట్టభద్రుల స్థానాలయినప్పటికీ దాదాపు వందకు పైగా శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే ఎన్నికలవి. ఉత్తరాంధ్ర, పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమ ప్రాంతాల్లో ఎన్నికలు జరిగాయి. అప్పుడు జనసేనతో పొత్తు లేదు. బీజేపీతో టీడీపీకి సఖ్యత లేదు. అయినా జనం టీడీపీ అభ్యర్థులకే పట్టం కట్టారు. ఇది బలమైన సంకేతం కాదా? ఇక్కడ ఓటమి ఎందుకొచ్చిందని ఒక్క రోజు దానిపై కేటాయించి పోస్టుమార్టం చేస్తే ఇంతటి దుర్గతి పట్టి ఉండేది కాదు గదా,అప్పటి వరకూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీదే వన్ సైడ్ విక్టరీ. అన్ని కార్పొరేషన్లు కైవసం చేసుకుంది. మున్సిపాలిటీలో తాడిపత్రి మినహాయించి ఫ్యాన్ పార్టీ అన్నింటినీ తన ఖాతాలో వేసుకుంది. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రజలు, ప్రభుత్వోద్యోగుల నాడి తెలుస్తుంది. ప్రభుత్వం పై వ్యతిరేకత ఉందో సానుకూలత ఉందో తెలుసుకునే వీలుంది. పశ్చిమ రాయలసీమ పరిధిలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ తరుపున భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పోటీ చేసి గెలిచారు. తూర్పు రాయలసీమకు సంబంధించి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లా అభ్యర్థిగా కంచర్ల శ్రీకాంత్ విజయం సాధించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి జరుగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేపాడ చిరంజీవిరావు విజయం సాధించారు. అయితే అప్పుడు వైసీపీ నేతలు ఈ ఎన్నికలు తమకు కొత్త అని, ఎలక్షనీరింగ్ ను తమ నేతలు చేయలేకపోయారని కుంటిసాకులు చెప్పి జగన్ ను తప్పుదోవపట్టించారు. అది నమ్మితాడేపల్లిలో కూర్చున్న జగన్ ఆ ఫలితాలను తేలిగ్గా తీసుకున్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓమిని చూసైనా అక్కడ రాజధాని కంటే జనం మరొకటి ఆలోచిస్తున్నారని భావించి ఉంటే ఇంత భారీ డ్యామేజీ జరిగి ఉండేది కాదు. కానీ ఆ పనిచేయలేదు. రాయలసీమలో పట్టున్న వైసీపీకి చిత్తూరు, నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటమిని చవిచూసినప్పుడయినా ఎక్కడో తేడా కొడుతుందన్న సందేహం వచ్చి ఉండాలి. కానీ సీమ తనను మోసం చేయదనుకున్నారు. నెల్లూరు, ప్రకాశంలో తనకు తిరుగులేదనుకున్నారు. అతి విశ్వాసంతో ఆ ఓటమిని అస్సలు పట్టించుకోలేదు. ఆ ఓటమిపై కనీసం విశ్లేషణ చేసేంత తీరిక కూడా జగన్ కు లేదు. పోనీ ఏమైనా పర్యటనలతో బిజీగా ఉన్నారా? అంటే అదీ లేదు. మూడు ప్రాంతాల నేతలను పిలిచి ఒక్కసారి మాట్లాడి వారితో గ్రౌండ్ రియాలిటీ తెలుసుకుని ఉంటే నాడే తన పరిస్థితి తనకు తెలిసి వచ్చేది. కానీ జగన్ ను అలాంటి పోస్టుమార్టం చేయకుండా కొందరు కోటరీ నేతలు అడ్డుపడటంతో శాసనసభ ఎన్నికలకు వచ్చే సరికి అసలుకే ఎసరు వచ్చింది. ప్రభుత్వంపై యువతలో వ్యతిరేకత ఎక్కువగా ఉందని నాడే ఆ ఎన్నికల్లో వ్యక్తమయింది. నిరుద్యోగ సమస్య పెరిగి పోవడం, పరిశ్రమలు రాకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వంటి కారణాలతో గ్రాడ్యుయేట్లు తమకు అండగా నిలుస్తారని భావించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. పథకాల ప్రయోజనం పొందుతున్న కుటుంబాలకు చెందిన వారు కూడా పెద్ద సంఖ్యలో ఈ ఓటర్ల జాబితాలో ఉన్నారు ప్రభుత్వ ఉద్యోగులు కూడా అడ్డంతిరిగి వైసీపీకి వ్యతిరేకంగా పనిచేశారు. అప్పుడు ఆఎన్నికలు బ్యాలట్ పేపర్లపైనే జరిగాయి. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్. ఆయనకు అనుకూలమైన పోలీసులు, అధికారులున్నారు. కానీ సొంత జిల్లా కడప ప్రాంతంలోనూ టీడీపీ నాడు గెలిచిందంటే నాడే టీడీపీ విజయం ఖాయమయిందని జగన్ గుర్తించాల్సి ఉంది. ఒకరకంగా చెప్పాలంటే ఆరోజే టీడీపీ విజయం ఖాయమయింది. జగన్ ఆ ఓటమిని ఈజీగా తీసుకున్నారు. అదే అసలు ఎన్నికలకు వచ్చేసరికి మరింత ఎక్కువయింది. ఆరోజు ఏమాత్రం మేలుకుని కొంతలో కొంతయినా మారి ఉన్నా, నిర్ణయాలను లోతుగా విశ్లేషించుకున్నట్లయితే నేడు ఇంతటి ఘోరమైన ఓటమి మాత్రం వచ్చేది కాదు. అభ్యర్థులను మారిస్తే చాలని జగన్ అనుకున్నారు కానీ అసలు కారణం తానేనని మాత్రం గుర్తించలేకపోవడమే అనర్థానికి కారణం

# వీసీ రాజీనామా

## విద్యార్థుల సంబరాలు

విజయవాడ, జూన్ 29, (న్యూస్ పల్స్)ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్?కు తన రాజీనామా లేఖను పంపారు. నాలుగు సంవత్సరాలుగా ఏయూ వీసీగా కొనసాగుతున్న ప్రసాద్ రెడ్డి.. 1987 నుంచి ఆంధ్రా యూనివర్శిటీలో కంప్యూటర్స్ విభాగపు హెచ్?ఓడీ, ప్రిన్సిపాల్, డీన్, రిజిస్ట్రార్, రెక్టార్?గా పనిచేశారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీసీ ప్రసాద్ రెడ్డి రాజీనామా ఆసక్తిని కలిగించింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వీసీగా నియమితులైన ప్రసాద్ రెడ్డి.. అప్పటి అధికార పార్టీ నేతలకు అనుకూలంగా పనిచేశారన్న విమర్శలను ఎదుర్కొన్నారు. ప్రసాద్ రెడ్డి హయాంలో యూనివర్సిటీని అత్యున్నత స్థాయికి తీర్చిదిద్దారని అందువల్లే ఇప్పటివరకూ ఎప్పుడూ దక్కని న్యాక్ ం++ అవార్డు వచ్చిందని ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ వీసీ కార్యాలయం విశాఖ రాజకీయ కార్యాలయంగా మారిందని టిడిపి విమర్శలు చేస్తోంది. అదే సమయంలో యూనివర్సిటీలో పదోన్నతుల్లో సామాజిక న్యాయం పాటించలేదని, కొంతమందిని టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టారని, వివక్ష చూపారన్న విమర్శల ఎదుర్కొంది. కొందరు మాజీ ప్రొఫెసర్లతో పాటు ప్రతిపక్షాలు కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తూ వచ్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో వీసీ రాజీనామా అంశం విస్తృత చర్చకి దారితీసింది. ప్రతిష్ఠాత్మక ఆంధ్రా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సర్?పై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. 1987 నుంచి అంటే దాదాపు 37 సంవత్సరాలుగా ఆంధ్ర యూనివర్సిటీలో రిజిస్టర్, రెక్టార్గా, ప్రిన్సిపల్, హెచ్?ఓడిగా అన్ని పరిపాలన స్థాయిల్లో పనిచేసిన ప్రసాద్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వైస్ ఛాన్సర్?గా నియమితులయ్యారు. అంతకుముందు ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా యూనివర్సిటీల్లో విద్యార్థులతో చేసిన కార్యక్రమాల్లో అత్యుత్సాహం చూపారని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఆయన్ని సస్పెండ్ చేసింది. దాంతో వైఎస్ఆర్సీపీ అధికారంలోకి రాగానే ఆయనను వైస్ ఛాన్సలర్?గా నియమించింది. వైస్ ఛాన్సర్?గా వివిధ కంపెనీల సిఎస్ఆర్ నిధులను సమీకరించి యూనివర్సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారన్న పేరు ఉంది.

# ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

## కాకినాడలో జులై 8 9 10 తేదీలలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ విజేంద్ర మాట్లాడుతూ కాకినాడలో జులై 8 9 10 తేదీలలో జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. విద్యార్థులకు చదువుతోపాటు రాజకీయాల పైన మరియు ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని తెలిపారు. కేవలం చదివే కాకుండా ఈ సమాజానికి ఉపయోగపడే విధంగా ఈ సమాజంలో విద్యావ్యవస్థలో జరుగుతున్నటువంటి అవినీతిని వెలికితీయడానికి, అవినీతి అక్రమాల పైన పోరాటాలు చేయడానికి ఈ శిక్షణా తరగతులలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రంలో విద్యారంగంలో వస్తున్న మార్పులపై సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులపై విద్యార్థులలో చైతన్యం నింపడానికి విద్యార్థుల శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల దృష్టిని ఆలోచించి తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని పిలుపునిచ్చారు అదేవిధంగా రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలను ప్రస్తుతం అధికారంలోకి రావడంతో విద్యార్థుల హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. డిగ్రీ ప్రవేశాలను ఆన్లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్లైన్ విధానంలో కొనసాగించాలని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షను రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్లో ఉన్న విద్యా దీవెన వసతి దీవెన మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలువిడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. కాకినాడలో జరుగుతున్న శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని విద్యార్థులు లోకానికి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సమీర్, అబ్దుల్ ఖాదర్, రయాన్, నరసింహులు, రవి, శివ,సురేష్,మహేష్, తదితరులు పాల్గొన్నారు

# టీడీపీ చేస్తే సంసారం, పక్కోడు చేస్తే వ్యభిచారమా ?

## కడప వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు ఫైర్

కడప,.కడప వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌రాష్ట్రంలో ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశిస్తున్నాం..కూటమి సూపర్ సిక్స్ పథకాలు వారిని గెలిపించాయని భావించవచ్చు అన్నారు. గతంలో 2014 ఎన్నికల్లో కూడా చంద్రబాబు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు..2019 లో అందుకే చంద్రబాబు ను ప్రజలు ఓడించారని ఆగ్రహించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనేక జిల్లాల్లో టీడీపీ నేతలు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయలేదా?వందల కోట్ల రూపాయల విలువ చేసే స్థలాలను కబ్జా లు చేశారన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనేక జిల్లాలో టిడిపి కార్యాలయాలను నిర్మించారు..కడపలో కూడా కోట్ల రూపాయల స్థలాన్ని టీడీపీ కార్యాలయ నిర్మాణానికి అప్పజెప్పా లని చూశారని మండిపడ్డారు. పాత మునిసిపాలిటి కార్యాలయ స్థలాన్ని అక్రమిచాలని చూశారు..మేయర్ గా ఆరోజు అడ్డుకుని కోర్టుకు పోయి స్టే తెచ్చామన్నారు. టీడీపీ నేతలు చేస్తే సంసారం, పక్కోడు చేస్తే వ్యభిచారం అని మాట్లాడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. అన్ని అనుమతులు తీసుకునే వైసీపీ కార్యాలయ నిర్మాణాలు చేపట్టామని వివరించారు.

# బాధ్యతల చేపట్టిన తర్వాత తొలిసారి ఉమ్మడి విశాఖ జిల్లా కు వచ్చిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు

## విశాఖపట్టణం విమానాశ్రయం లో ఆత్మీయ స్వాగతం

అనకాపల్లి స్పీకర్ పదవీ స్థానానికి ఎన్నికైన తదుపరి మొదటిసారిగా ఉమ్మడి విశాఖ జిల్లాకు విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నకు విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది చంద్ర బాబు నాయుడు స్పీకర్ పదవి ద్వారా అత్యున్నత గౌరవం ఇచ్చి ప్రధాన బాధ్యతలు అప్పగించారని చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానని పేర్కొన్నారు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ఆయన కు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి,ఎస్పీ మరళీకృష్ణ, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

# గోదావరిలో దూకిన మహిళ.. కాపాడిన జాలర్లు

రాజమండ్రి, జూన్ 29, (న్యూస్ పల్స్)కొందరు చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా ఓ వివాహిత కుటుంబ కలహాలతో గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించగా అక్కడి జాలర్లు ఆమెను రక్షించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూ.గో జిల్లా రాజమండ్రికచెందిన ఓ వివాహిత కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించి రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జి వద్ద గోదావరిలో దూకింది. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి అక్కడి జాలర్లను అప్రమత్తం చేశారు. వారు పడవపై వేగంగా వెళ్లి సదరు మహిళను రక్షించారు. జాలర్ల సాయంతో మహిళను రక్షించిన పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా, జాలర్లు సినిమా స్టైల్లో మహిళను రక్షించిన తీరుపై అంతా ప్రశంసలు కురిపిస్తున్నారు. సకాలంలో స్పందించిన పోలీసులపై సైతం ప్రశంసలు కురుస్తున్నాయి. రాజమండ్రి టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రత్తయ్య, కానిస్టేబుల్ లీలకుమార్‌పై ప్రశంసల జల్లు కురుస్తోంది. మహిళను జాలర్లు రక్షించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

## జులై 1 న, ఆలయ భూముల బహిరంగ కౌలు వేలం..

**ఆలయ కార్య నిర్వాహక అధికారి బి.చంద్రుడు..**

దొర్నిపాడు,జూన్:29,శ్రీ ప్రస్థానం న్యూస్ :- మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో వెలసిన శ్రీ" నాగేశ్వర స్వామి,శ్రీ చెన్న కేశవ స్వామి దేవ స్థానమునకు చెందిన ఆలయ భూములకు జులై 1వ తేదీ సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహక లో బి.చంద్రుడు, శని వారం ఓ ప్రకటనలో వెల్లశ్రీశ్రీడించారు. ఈ సంధర్భంగా ఈ.ఓ. మాట్లాడుతూ శ్రీ "నాగేశ్వర స్వామి దేవస్థా?నికి సంబంధించి ఎ"25- 62 సెంట్లు, శ్రీ"చెన్న కేశవ స్వామి దేవస్థానము కు సంబందించి ఎ"26- 46 సెంట్లు, మొత్తం కలిపి ఎ"52- 08 సెంట్ల, ఆలయ భూములకు ఉదయం 10-00 గంటలకు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు అయన తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను ఏడాది కాల పరిమితి తో నిర్వహించే ఆలయ భూముల కౌలు వేలం పాటలో పాల్గొనే రైతులు ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చెలించాలని.. వారు మాత్రమే బహిరంగ కౌలు వేలం పాటలో పాల్గొనడానికి అర్హులు అని అన్నారు. జి.ఓ.ఎం.ఎస్. నెం.426 రెవిన్యూ (ఎండో మెంట్-1), తేదీ 9-11- 2015 ప్రకారం హిందూ మతస్తులు తప్ప, అన్యమ తస్తులు బహిరంగ వేలంలో పాల్గొన రాదని ఆయన తెలిపారు...

## పత్తిలో సస్యరక్షణ అధిక దిగుబడులు..ఏ. డి. ఏ. సరళమ్మ






దొర్నిపాడు, జూన్:29, శ్రీ ప్రస్థానం న్యూస్:- పత్తి పంట లో సస్యరక్షణ తో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏ డి ఏ.సరళమ్మ, కీటక శాస్త్ర నిపుణులు శివ రామకృష్ణ,లు రైతులకు సూచించారు..శనివారం దొర్నిపాడు మండల కేంద్రం లోనీ అంకాలమ్మ గుడి ప్రాంగణంలో మండల వ్యవ సాయాధికారినీ కె.సునీత,అద్యక్షన ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఏ డి ఏ, కీటక శాస్త్ర నిపుణులు, హాజరై రైతులతో నేరుగా మాట్లాడుతూ మట్టి నమునాలతో భూసారాన్ని తెలుసుకుని ఫలితాల ఆధారంగా తగిన మోతాదుల్లో ఎరువులు వాడితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు నని .. అంతే కాకుండా పత్తి పంట లో వచ్చు గులాబీ రంగు రంగు, వాటి సస్య రక్షణ చర్యల గూర్చి పలు యాజమాన్య పద్ధతుల పై రైతులకు అవగాహణ కల్పించారు. ప్రభుత్వం ఉచితంగా చేస్తున్న మట్టి నమూనా పరీక్షల కోసం రైతులు ముందుకు రావాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు..

## చైనా సరిహద్దుల్లో విషాదకర ఘటన

**వరద ఉధృతికి కొట్టుకు పోయిన ట్యాంక్**

**ట్యాంక్‌తో సహా కొట్టుకు పోయిన ఐదుగగురు జవాన్లు**

**ఆకస్మిక వరదలే కారణమని రక్షణ శాఖ వెల్లడి**

**తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్**

లద్దాఖ్,జూన్29: చైనా సరిహద్దుల్లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్ లోని వాస్తవాధీన రేఖ సమీపంలో గల న్యోమా-చుషుల్ ప్రాంతంలో భారత సైన్యం విన్యాసాలు చేస్తుండగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు.లేహ్‌కు 148 కిలోమీటర్ల దూరంలోని బోధి నదిలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విన్యాసాల్లో భాగంగా యుద్ధ ట్యాంక్‌లతో నదిని దాటుతుండగా ఈ వరదలు సంభవించాయి. దీంతో నదిలో నీటి ఉధృతి పెరిగి టీ-72 ట్యాంక్ మునిగిపోయింది. అందులోని ఐదుగురు జవాన్లు నదిలో కొట్టుకుపోయారు. అప్రమత్తమైన సైన్యం వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. జవాన్ల కోసం నదిలో గాలించింది. అయితే, దురదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో వారంతా ప్రాణాలు కోల్పోయినట్లు రక్షణశాఖ అధికారులు వెల్లడించారు. ఐదుగురి మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. మృతుల్లో జూనియర్ కమిషన్డ్ అధికారి కూడా ఉన్నారు. ప్రమాదంపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్యాంక్‌తో నదిని దాటుతుండగా జరిగిన దురదృష్టకర ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. దేశం కోసం మన సైనికుల అపార సేవను ఎప్పటికీ మర్చిపోలేం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ క్లిష్ట సమయంలో యావత్ దేశం వారికి అండగా నిలుస్తుందని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# పదవీ విరమణ పొందిన ఎంపీడీఓ,పంచాయితీ కార్యదర్శి,లకు ఘణ సన్మానం..



దొర్ని పాడు, జూన్:29, శ్రీ ప్రస్థానం న్యూస్:- స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ. గా విధులు నిర్వహిస్తున్న పి.వి. సుబ్బా రెడ్డి, పంచాయతి సెక్రటరీ గా విధులు నిర్వర్తించే శ్రీనివాసులయ్య,లకు ఆదివారం పదవీ విరమణ చేయనున్న సందర్భంగా శనివారము దొర్నిపాడు మండల కేంద్రము లోనీ లక్ష్మి ఫంక్షన్ హాలులో ఇరువురికి పదవీ విరమణ మహోత్సవ కార్య క్రమంను ఘనంగా నిర్వహించారు.. అనంతరము పదవీ విరమణ పొందిన ఎంపీడీఓ, పంచాయతి సెక్రటరీ,లకు మండల పరిషత్ అధ్వర్యంలో పూల బోకేలు లతో పాటు శాలు వాతో కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.. పదవీ విరమణ పొందిన ఎంపీడీఓ. పంచాయితీ కార్య దర్శి,లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగం లో పనిచేసే ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పని సరి అనీ ..వృత్తిలో భాగంగా తమ సేవలకు గుర్తింపుగా శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించి సత్కరించినందుకు గాను ఇరువురు తమ సహచర సిబ్బందికి ముందుగా ప్రత్యేక కృతజ్ఞతాభినంద నలు తెలిపారు. దొర్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకూ కూడా విధి నిర్వహణలో నాకు అండగా నిలిచి మండల అభివృద్ధికి పూర్తి స్థాయి సహకారం అందించి సహకరించిన దొర్ని పాడు ప్రజలకు, తోటి అధికారులకు, ప్రజా ప్రతినిధి లకు ప్రత్యేక కృతజ్ఞతలు అని ఎంపీడీఓ.పి.వి. సుబ్బా రెడ్డి, భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పీ ఆర్ డి.శ్రీనివాసులు, ఎంపిపి.గోపవరం అమర్నాథ్ రెడ్డి, టిడిపి కి చెందిన, మాజీ మండల అధ్యక్షులు, భూమా బ్రహ్మానంద రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సిద్ది సత్యం, మండల వైసిపి నాయకులు బత్తుల నాగేశ్వర యాదవ్, డిప్యూటి తహశీల్దార్ వెంకట రవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఆయా మండలాల ఎంపీడీఓ,లు ఆయా గ్రామాల సర్పంచ్,లు, ఎంపీటీసీ, లు మండల రెవిన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది,వెలుగు సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు..


# ప్రశ్నించే గొంతు మూగబోయింది-యార్లగడ్డ

## మండవ రమ్య మరణం పార్టీకి తీరని లోటు

ఉంగుటూరు,తెలుగుదేశం పార్టీ ఉంగుటూరు మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ ఆకస్మిక మరణం ఆమె కుటుంబానికే కాకుండా తెలుగుదేశం పార్టీకి తీరని లోటని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. నాలుగురోజుల క్రితం షిరిడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమ్యకృష్ణ కుటుంబ సభ్యులను శనివారం ఉదయం ఉంగుటూరు మండలం పెద్దావుటపల్లి లోని రమ్య స్వగృహంలో వెంకట్రావ్, జ్ఞానేశ్వరి దంపతులు పరామర్శించి ఓదార్చారు. రమ్యకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వెంకట్రావ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు రమ్యకృష్ణ ధైర్యంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధి కృషి చేశారని గుర్తు చేసారు. తనపైఎన్నో పోలీస్ కేసులు పెట్టి వేధింపులకు గురి చేసినా వాటికి ఎదురొడ్డి పోరాడిన తీరు స్ఫూర్తిదాయకం అన్నారు. గన్నవరంలో టీడీపీ ఆఫీస్ ధ్వంసం చేసిన వైసీపీ గుండాలు తిరిగి టీడీపీ నాయకులు కార్యకర్తలపైనే కేసులు పెట్టగా రెండు నెలలు అజ్ఞాతవాసం చేసారని గుర్తుచేశారు. వైసీపీ నాయకుల అవినీతి అక్రమాలపై ప్రశ్నించడంతో పాటు తెలుగుదేశం పార్టీ ని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు రమ్యకృష్ణ చేసిన కృషిని కొనియాడారు. పార్టీ అధికారంలో రావటం కోసం ఎంతగానో కృషిచేసిన రమ్యకృష్ణ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులలో మరణించడం బాధాకరమన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో తన గెలుపు కోసం అహర్నిశలు పనిచేసిన రమ్య ఇక లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. నిజాయితీ నిబద్ధతతో పనిచేసే ఆమె లేకపోవటం, గన్నవరంలో ప్రశ్నించే గొంతు మూగబోయింది అని, ఆమె కుటుంబానికి తెలుగుదేశం పార్టీతోపాటు తాను అండగా ఉంటానని వెంకట్రావ్ ఈసందర్భంగా హామీ ఇచ్చారు

# నేడు అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం

అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవాన్ని (ఆస్టరాయిడ్) దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 30న నిర్వహిస్తారు. 1908, జూన్ 30న రష్యా సమాఖ్య, సైబీరియాపై తుంగస్కా గ్రహశకలం ప్రభావంకు గుర్తుగా, గ్రహాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంతో ఈ దినోత్సవం జరుపుతారు. ఇటీవలికాలంలో భూమిపై అత్యంత హానికరమైన గ్రహశకలానికి సంబంధించినత సంఘటన ఇది. 1908, జూన్ 30న రష్యాలోని సైబీరియా స్టోనీ తుంగుస్కా నది సమీపంలోని భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టడంతో దాదాపు 2,072 చ.కి.మీ. విస్తీర్ణంలో అటవీ ప్రాంతం నాశనమైంది. దానికి గుర్తుగా జూన్ 30న అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవంగా జరుపుతున్నారు. ఐక్యరాజ్యసమితి తన తీర్మానంలో ప్రతి సంవత్సరం జూన్ 30 న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రకటించింది. గ్రహశకలం దినాన్ని స్టీఫెన్ హాకింగ్, చిత్రనిర్మాత గ్రిగోరిజ్




రిక్టర్స్, బి 612 ఫౌండేషన్ ప్రెసిడెంట్ దానికా రెమి, అపోలో 9 వ్యోమగామి రస్టీ ష్వీకార్ట్, క్వీన్ గిటారిస్ట్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త బ్రియాన్ మే కలిసి స్థాపించారు. రిచర్డ్ డాకిన్స్, బిల్ నై, పీటర్ గాబ్రియేల్, జిమ్ లోవెల్, అపోలో 11 వ్యోమగామి మైఖేల్ కాలిన్స్, అలెక్సీ లియోనోవ్, బిల్ అండర్స్, కిప్ థోర్న్, లార్డ్ మార్టిన్ రీస్, క్రిస్ హాడ్ఫీల్డ్, రస్టీ ష్వీకార్ట్, బ్రియాన్ కాక్స్ సహా 200 మంది వ్యోమగాములు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, కళాకారులు గ్రహశకల దినోత్సవ ప్రకటనకు సంతకాలు చేశారు. 2014, డిసెంబరు 3న ఈ అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం అధికారికంగా ప్రారంభించబడింది. 2014, ఫిబ్రవరిలో రాక్ బ్యాండ్ క్వీన్ కోసం ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, గిటారిస్ట్ బ్రియాన్ మే 51 డిగ్రీ నార్త్ చిత్రానికి దర్శకుడు గ్రిగోరిజ్ రిక్టర్స్ తో కలిసి పనిచేయడం ప్రారంభించాడు. లండన్ పై కల్పిత ఉల్క ప్రభావ సంఘటన ఫలితంగా ఏర్పడిన మానవ పరిస్థితుల నేపథ్యంతో రూపొందించిన ఈ చిత్రానికి బ్రియాన్ మే సంగీతం సమకూర్చాడు. ఈ చిత్రాన్ని 2014 స్టార్‌మస్ ఫెస్టివల్‌లో ప్రదర్శించిన తరువాత రెమి, ష్వీకార్ట్, రిక్టర్స్, మే కలిసి 2014, అక్టోబరులో ఈ దినోత్సవాన్ని స్థాపించి.. లార్డ్ మార్టిన్ రీస్, రస్టీ ష్వీకార్ట్, ఎడ్, థామస్ జోన్స్, రియాన్ వాట్, బిల్ నై విలేకరుల సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం లండన్ లోని సైన్స్ మ్యూజియం, కాలిఫోర్నియా అకాడమీ ఆఫ్ సైన్సెస్, న్యూయార్క్, సావో పాలో నుండి ప్రత్యక్షప్రసారం చేయబడింది. 2017 గ్రహశకలం దినోత్సవం రోజున, మైనర్ గ్రహం 248750 ను అంతర్జాతీయ ఖగోళ యూనియన్ అధికారికంగా గ్రహశకలం అని పిలిచింది. ఈ దినోత్సవం రోజున గ్రహశకలాల స్థితిన గమనించి భూమిని, భవిష్యత్ తరాలను ఆయా విపత్తు సంఘటనల నుండి రక్షించడానికి చేయవలసిన కార్యకలాపాల గురించి చర్చలు జరుపుతారు.

## తిరుమలలో ముదురుతున్న మఠాల వ్యవహారం.. పోరాటానికి పిలుపునిచ్చిన జనసేన..

తిరుమలను మఠాల వ్యవహారం కుదిపేస్తోంది. మఠాల అక్రమ కట్టడాలు, నిర్వహణ వ్యవహారాలపై జోరుగా చర్చ నడుస్తోంది. ముఠాలకు కేంద్రాలుగా మఠాలు మారిపోయాయంటున్న జనసేన పోరాటం..రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మఠాల నిర్మాణాలను తప్పుపడుతూ కొందరు స్వాజీలు సైతం ప్రత్యక్ష నిరసనలకు దిగడంతో కొండమీద మఠాల ఇష్యూ ముదిరింది. తిరుమల అతిపెద్ద ధార్మిక క్షేత్రం. తిరుమలేశుడు కొలువైన వైకుంఠంలో పలు మఠాల నిర్మాణానికి టిటిడి అనుమతి ఇవ్వడంతో ప్రస్తుతం 33 వరకు మఠాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వైష్ణవ సంప్రదాయం మేరకు శ్రీవారి నిత్య కైంకర్యాలు జరిగే తిరుమల క్షేత్రంలో శ్రీకృష్ణదేవరాయలు కాలం నుంచి మఠాల సంప్రదాయం వచ్చింది. రాయలవారి కాలంలో కర్ణాటకకు చెందిన వ్యాసరాయరు తిరుమల ఆలయ పర్యవేక్షణ చేపట్టగా క్రీస్తు శకం 1522 నాటి నుంచి 12 ఏళ్ల పాటు వ్యాసరాయులు పాలన తిరుమలలో సాగింది. ఈ మేరకు అప్పుడే వ్యాసరాజ మఠం తిరుమలలో ఏర్పడింది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఉచితంగా భోజన వసతి కల్పించడం, మఠాధిపతులు తిరుమలకు వచ్చినప్పుడు సేద తీరేందుకు వీలుగా అప్పటి నుంచే ఈ మఠాల ఏర్పాటు అనివార్యమైంది.ఇలా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన మఠాధిపతులు, పీఠాధిపతులు తిరుమలలో కార్యకలాపాలు సాగించేందుకు వీలుగా మఠాల నిర్మాణం జరిగింది. ఆయా మఠాలకు చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులు వెంకన్న దర్శనానికి వచ్చినప్పుడు పెద్ద మర్యాద, చిన్న మర్యాదలు చేపట్టాల్సి ఉండగా టిటిడి సైతం ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తమంలోపు ఇప్తికపాల్ మర్యాదలు ఆయా మఠాల సాంప్రదాయాల ప్రకారం టిటిడి ఇప్పటికే చేస్తోంది. ఇలా తిరుమలలో వసతి సౌకర్యం లేని రోజుల్లో భక్తులకు మఠాధిపతులు, పీఠాధిపతులకు వసతికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీటిని అందుబాటులోకి తెచ్చారు. దీంతో క్రమంగా తిరుమలలో మఠాల ప్రాధాన్యత పెరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మఠాధిపతులు, పీఠాధిపతులు తిరుమలలో తమ పలుకుబడికి ప్రాధాన్యత ఇచ్చే ప్రయత్నం చేయడంతో మఠాల సంఖ్య పెరిగింది. ఇలా 2004 వరకు తిరుమలలో 18 మఠాలు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 33 కు చేరుకుంది. ఈ మేరకు తిరుమలలో మఠాల నిర్మాణాలు, అవసరాలకు తగ్గట్టు మరమ్మత్తులు చేస్తుండటంతో అత్యాధునిక సౌకర్యాలతో మోడ్రన్?గా మారిపోతున్నాయి. దీంతో తిరుమల మఠాల నిర్వహణపై గత కొన్నేళ్ళుగా విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.ప్రభుత్వ పెద్దలతో తమ పలుకుబడిని ఉపయోగించుకొని తిరుమలలో మఠాలను నిర్మించడం, ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న మఠాలను పునర్నిర్మాణం పేరుతో కట్టడాలు చేపట్టడం చర్చగా మారింది. ఈ నేపథ్యంలోనే విశాఖ శారదా పీఠం మఠం నిర్మాణ పనులు తెరమీదికి వచ్చింది. తిరుమలలో ఉన్న విశాఖ శారదా పీఠం 6 అంతస్తుల్లో చేపట్టిన విస్తరణ పనులపై వివాదం నెలకొంది. అనుమతులు లేకుండా నిబంధనలను ఉల్లంఘించి శారదా పీఠం మఠాన్ని విస్తరిస్తోందని పక్కనే ఉన్న మరో మఠం కోర్టును ఆశ్రయించింది. దీంతో మఠాల నిర్మాణ పనులపై టిటిడి జోక్యం చేసుకుంది. గత ఏప్రిల్?లో పనులను ఆపివేసింది. అయితే ఇప్పుడు విశాఖ శారదా పీఠానికి చెందిన మఠం అక్రమ కట్టడాలను ప్రశ్నిస్తూ జనసేన.. ప్రత్యక్ష పోరాటానికి దిగింది. తిరుమలలో మఠాల నిర్వహణ తీరును తప్పుపడుతోంది. రెండ్రోజుల క్రితంతిరుమలలో విశాఖ శారదా పీఠం నిర్మిస్తున్న నిర్మాణాలను పరిశీలించిన జనసేన నేతలు.. తిరుమలలో మఠాల పేరుతో కోట్లాది రూపాయల స్కాం జరుగుతోందని ఆరోపించారు.

## పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఒక్క నాయకులు పాల్గొనాలి

**మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్ నాయుడు, వెంకటరాముడు చౌదరి**

తుగ్గలి,జులై 1వ తేదీన నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పరిధిలోని గల తెలుగుదేశం పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధికారులతో పాటు అట్టహాసంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుగ్గలి మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వెంకటరాముడు చౌదరి లు తెలియజేశారు. శనివారం రోజున విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు 4000 రూపాయలతో పాటు మూడు నెలలకు సంబంధించిన మూడువేల రూపాయల మొత్తంతో 7000 రూపాయలను అందజేస్తుందని వారు తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఒక్కొక్క హామీలను రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని వారు తెలియజేశారు.తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి వెలువడిన ఆదేశాల మేరకు కావున జూలై 1న జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పరిధిలోని గల తెలుగుదేశం పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులతో పాటు వెళ్లి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని వారు తెలియజేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తామని వారు తెలియజేశారు.

## విజిలెన్స్ విచారణ జరిపించాలి.

**ఆదాల అంటే మోసం-నయ వంచన**

**ఆదాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన మదన్ కుమార్ రెడ్డి**

**దొంగ బిల్లు కాబట్టే. 67 కోట్ల బిల్లు నిలిపివేత.**

నెల్లూరు,నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి నిర్వహిస్తున్న ఏపీఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించి ,అప్పటి ప్రభుత్వ అండదండలతో అక్రమంగా సీఎఫ్ఎంఎస్ లో పొందుపరిచిన 67 కోట్ల బిల్లులకు సంబంధించి పేమెంట్ ను రాష్ట్ర ప్రభుత్వమే రద్దు చేసిందని, ఈ దొంగ బిల్లుకు సంబంధించిన దీనిపై సమగ్రంగా విజిలెన్స్ విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ నేత మదన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం సాయంత్రం మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఓ మోసగాడు, నయవంచకుడని విమర్శించారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం కార్యకర్తలను బలి చేశారన్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై పోటీ చేయాలంటే తన 67 కోట్ల దొంగ బిల్లును మంజూరు చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని డిమాండ్ చేసినట్టు తెలుస్తుందన్నారు.

## తెలంగాణ తెలుగు మహిళలకు చింతమనేని ఆత్మీయ సత్కారం

దెందులూరు,జూన్29:గడచిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దెందులూరు నియోజకవర్గంలో జరిగిన చింతమనేని ప్రభాకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని పార్టీ గెలుపు కోసం కృషి చేసిన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన "తెలంగాణ తెలుగు మహిళల బృందం" శనివారం ఉదయం దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు తెలంగాణ తెలుగు మహిళలు బృందం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కృషి చేసిన, ఖమ్మం జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు మందపల్లి రజనీ సహా తెలుగు మహిళా విభాగం నాయకులు కామా అనిత, పల్లగాని రమ్య, మోదేపల్లి రమాదేవి, వెలగపూడి విజయలక్ష్మి తదితర తెలుగు మహిళలకు పుట్టింటి కానుకను తలపించేలా పసుపు కుంకుమ, చీర వంటివి అందించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వారిని ఘనంగా సత్కరించారు. ఎన్నికల వేళ తనకోసం ఎంతో కృషి చేసిన ప్రతి తెలుగు మహిళకు ఒక అన్నలాగా ఎల్లపుడూ అండగా ఉంటాను అని, అభిమానానికి రాష్ట్ర సరిహద్దులు అడ్డుగోడలు కాలేవు అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు బొప్పన సుధా, నంబూరి నాగరాజు, మాగంటి మిల్లు బాబు, లావేటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, ఎబొఈ అధ్యక్షులు పెనుబొయిన మహేష్ యాదవ్ సహా పలువురు సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జీలు గ్రామ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ మంత్రి అతిషిపై పరువు నష్టం కేసు..

**పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు..**

ఢిల్లీ మంత్రి అతిషిపై ఢిల్లీ బీజేపీ మీడియా చీఫ్ ప్రవీణ్ శంకర్ కపూర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసును రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు స్వీకరించింది. కేసు విచారణను జూలై 23వ తేదీకి లిస్ట్ చేసింది. ఈ కేసులో మంత్రి అతిషి తరఫున లాయర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. బీజేపీ నేత తరఫున న్యాయవాది శౌమేందు ముఖర్జీ మాట్లాడుతూ అతిషి తన న్యాయవాదులతో వీసీ ద్వారా హాజరయ్యారని.. సమన్లు అందజేయలేదని పేర్కొన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలకు డబ్బులు ఆశ చూపినట్లుగా తప్పుడు ఆరోపణలు చేసి పార్టీ ప్రతిష్టను దిగజార్చారని ఆరోపించారు. ఆప్ చేసిన ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని ప్రవీణ్ శంకర్ కపూర్ పేర్కొన్నారు.ఇదిలా ఉండగా.. ఢిల్లీ మద్యం పాల కేసులో సీఎం కేజ్రీవాల్ అరెస్ట్ అనంతరం.. ఓ సమావేశంలో మంత్రి అతిషి మాట్లాడుతూ.. బీజేపీ ఒక్కొక్క ఎమ్మెల్యేకు రూ.25కోట్ల ఆఫర్ చేస్తూ.. నేతలను కొనేందుకు ప్రయత్నిస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ప్రయత్నం చేస్తుందని.. ఏడుగురు ఎమ్మెల్యేలను కొనేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఆప్ చేసిన ఆరోపణలను బీజేపీ కొట్టిపడేసింది.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757